# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 11-6-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 272 | పేజీలు: 8 | వెల: రూ.1/-


## గాంధీ డాక్టర్లపై దాడి కేసులో పురోగతి

### కారకులను అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,జూన్10(ఆర్ఎన్ఎ): గాంధీ హాస్పిటల్లో మంగళవారం డాక్టర్‌పై దాడి చేసిన వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైద్య సిబ్బందిపై దాడి చేస్తే సహించబోమని పోలీసులు తెలిపారు. వైద్యులపై దాడి చేస్తే చాలా కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. కరోనా విజృంభిస్తోన్న ఈ సమయంలో వైద్యులే మన ఫ్రంట్‌లైన్ లీడర్లని పోలీసులు అన్నారు. మంగళవారం రాత్రి ఓ వ్యక్తి కరోనా వల్ల మృతిచెందాడు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే తమ వ్యక్తి చనిపోయాడని ఆగ్రహిస్తూ అతని బంధువులు దాడికి దిగారు. నేరుగా హాస్పిటల్ మూడో ఫ్లోర్‌లోని ఐసీయూలోకి వెళ్లి అక్కడున్న ఓ డాక్టర్ పై దాడి చేశారు. దాంతో డాక్టర్లంతా తమకు భద్రత కల్పించాలంటూ ఆందోళనకు దిగారు. ఎట్టకేలకు డాక్టర్లపై దాడిచేసిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జూనియర్ డాక్టర్లపై రెండు నెలల్లో ఇలా దాడులు జరగడం ఇది రెండోసారి. గాంధీ ఆసుపత్రిలో తమపై దాడిని నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపడుతున్నారు. గాంధీ ఆసుపత్రి బయట రోడ్డుపై బైఠాయించిన వీరిని ఆందోళన విరమించాలని తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేందర్ కోరారు. చర్చల కోసం వైద్యుల ప్రతినిధులు సచివాలయానికి రావాలని ఆయన ఆహ్వానించారు. రోవైపు గాంధీ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి దాడికి తెగబడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరిని అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు.

# త్వరలో రాష్ట్రంలో ఐదు విప్లవాలు

### చెరువులు, కుంటలు నింపాలన్నదే కేసీఆర్ లక్ష్యం
### ఐఏఎస్‌లకు పాఠ్యాంశాలుగా తెలంగాణ విజయగాథలు
### రైతుబంధు ఆగుతుందన్నది కేవలం దుష్ప్రచారం మాత్రమే
### తెలంగాణ అభివృద్ధితో కాంగ్రెసోళ్లకు కడుపు మంట
### గోదావరి జలాలకు జలహారతి ఇచ్చిన మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల,జూన్10(నేటినిజం ప్రతినిధి): ఆనాటి భగీరథుడు నీటిని శివుని నెత్తి నుంచి భూమి మీదకు తెస్తే.. ఈనాటి అపర భగీరథుడు కెసిఆర్ గోదావరి నీటిని కింది నుంచి పైకి తీసుకెళ్తున్నారని మంత్రి కెటిఆర్ అన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. ముస్తాబాద్ మండలం బదనకల్ చెరువుకు చేరిన కాళేశ్వరం నీటికి ఆయన జలహారతి ఇచ్చారు. గోదావరి జలాలు మెట్టప్రాంతమైన బదనకల్ రావడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ తీరు నక్కలన్నీ కలిసి సంతాప సభ పెట్టినట్లు ఉందని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ జల దీక్షలకు అర్థం ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలకు సిగ్గు ఉందా.. అన్ని ఏళ్ళు పాలించి ఏం చేశారని నిలదీశారు. కేసీఆర్ పాలన చూసి కాంగ్రెస్ నేతలకు కడుపులు మండుతున్నాయన్నారు. కళ్ళు ఎర్ర బడుతున్నాయని..కోపం, ఈర్ష్యతో కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

రైతులను రాబంధుల్లా కాంగ్రెస్ నేతలు పీక్కుతున్నారని అన్నారు. ఆరేళ్లలో కేసీఆర్ ఏం చేశారో కనపడ్డలేదా అని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఎర్రటి ఎండల్లో కూడా చెరువులు మత్తడి దుంకుతున్నాయి. యాభై ఏళ్లలో ఎన్నడు చూడని అద్భుత దృశ్యం చూస్తున్నాం. అన్నం తెలియదని వెక్కిరిచ్చిన వాళ్ల చెంపపై కొట్టేలా.. దేశానికే అన్నం పెట్టేలా తెలంగాణ రైతులు ఎదుగుతున్నారు. రాష్ట్రంలోని చెరువులు, కుంటలు నింపాలన్నదే కేసీఆర్ లక్ష్యం. తంగళ్లపల్లి వాగు వానాకాలంలో కూడా ఎండిపోయేది. అక్కడ ఇప్పుడు 365 రోజులు నీళ్లు ఉంటున్నాయి. మిడ్ మానేరు నిండటంతో సిరిసిల్ల జిల్లాలో 6 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయి. దేశంలో ఇదో రికార్డు. ఈ విషయాన్ని ముస్సోరీలోని సివిల్ సర్వీస్ ఐఏఎస్ అధికారులకు పాఠాలుగా బోధిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 666 చెరువులు కూడా ఇదే రీతిగా నింపుతాం. కరెంటు మీద ఆధారపడకుండా రెండు పంటలు పండించి చూపిస్తామని అన్నారు. తెలంగాణ వచ్చాక ఇంత త్వరగా నీళ్లొస్తాయని ఎవరూ అనుకోలేదు. సముద్రమట్టానికి 82 మీటర్ల ఎత్తులో ఉన్న మేడిగడ్డ నుంచి 618 మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మకు గోదావరి జలాలను సీఎం తీసుకువచ్చారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులతో జలవిప్లవం రాబోతోంది. దాదాపు 1.25 కోట్ల ఎకరాల భూములకు సాగునీరిచ్చి రెండో హరిత విప్లవం తెస్తున్నాం. బంగారం పండే సారవంతమైన నేలలు ఇక్కడ ఉన్నాయి. నీళ్లు కూడా వస్తే రైతుల బతుకులు బాగవుతాయన్నారు. చెరువు బాగుంటే అన్ని కులవృత్తుల వారికి ఉపాధి దొరుకుతుందని కెటిఆర్ అన్నారు. తెలంగాణలో 46 వేల చెరువులు ఇదే తీరులో నింపితే ఇక సమస్యే ఉండదు. చేపలు, రొయ్యల పెంపకం రూపంలో నీలి విప్లవం మన రాష్ట్రంలో రాబోతోంది. ఇంటింటికి గేదెలు, ఆవులిచ్చి శ్వేత విప్లవం తెస్తాం. యాదవ సోదరులకు గొర్రెలిచ్చి గతంలో ఉన్న కోటి గొర్రెలను రెట్టింపు చేశాం. మాంసోత్పత్తిలో, పౌల్ట్రీ ఉత్పత్తిలో తెలంగాణ నెంబరు వన్ అని కేంద్రమే చెబుతోంది. మాంసోత్పత్తి ద్వారా పింక్ విప్లవం తెస్తున్నాం. ఈ విధంగా ఐదు రకాల విప్లవాలు తెలంగాణలో తెచ్చి గ్రామీణ వ్యవస్థను అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. కరోనా మహమ్మారి వల్ల అందరికీ మూతికి బట్టకట్టుకునే కాలవొచ్చింది. దాన్ని కూడా ఎదుర్కొందాం. బదనకల్ గ్రామానికి కావాల్సిన మౌళిక వసతులకు నిధులన్నీ కేటాయిస్తాం. రైతుబంధు విషయంలో కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారు. ఏ ఒక్క పథకాన్ని ఆపే ఆలోచన ప్రభుత్వానికి లేదు. రైతుల కోసం ఎన్నో పనులు చేసిన కేసీఆర్‌ను మించిన ముఖ్యమంత్రి ఎవరూ లేరు. రైతువేదికల ద్వారా అన్నదాతలను సంఘటితం చేసి బంగారు పంటలు పండేలా సమాలోచనలు చేస్తాం. వ్యవసాయాన్ని కొత్తపుంతలు తొక్కించేందుకే నియంత్రిత పంటల విధానం అమలులోకి తెచ్చాం. రైతులకు మద్దతు ధరకు మించిన డబ్బులు రావాలన్నదే సీఎం ఆలోచన. సర్కారు చేస్తున్న ఈ ఆలోచనకు వక్రభాష్యం చెప్తున్నారు. తాను చెప్పిందే వేయాలని సీఎం కేసీఆర్ చెప్పడం లేదు? డిమాండ్ ఉన్న పంటలు వేసుకోవాలని చెబుతున్నారు.



గతంలో రైతుబంధు వచ్చిన వారందరికీ మళ్లీ చెక్కులు ఇస్తాం. ఇంకా అవసరమైతే మరికొంత మందికి కూడా ఇస్తాం. నర్మాల చెరువును దసరాలోపే నింపి యాసంగికి నీళ్లిచ్చే బాధ్యత నాదే అంటూ కెటిఆర్ ప్రకటించారు. మిడ్ మానేరు నుంచి 1000 కోట్లతో ఎత్తిపోతల ద్వారా.. మల్లన్నసాగర్ నుంచి కాలువ ద్వారా నర్మాల నింపాలన్న ద్విముఖ వ్యూహంతో పనిచేస్తున్నాం. జూన్ 13న కాంగ్రెస్ జలదీక్ష చేస్తారట. కుందేళ్లను చంపి తిన్న నక్కలన్నీ కలిసి సంతాప సభ పెట్టినట్లు ఉంది కాంగ్రెస్ దీక్ష అని ఎద్దేవా చేశారు. నర్మాల చెరువు ఎందుకు నిండలేదని కాంగ్రెసోళ్లు జలదీక్ష చేస్తారట. మరి 60 ఏళ్లలో మీరెందుకు ఈ చెరువు నింపలేదో చెప్పాలన్నారు. మన చెరువులు నిండి.. పొలాలు పండుతుంటే.. కాంగ్రెసోళ్ల కడుపులు మండుతున్నయి. రైతులను రాబంధుల లెక్క పీక్కు తిన్నవాళ్లు.. ఇవాళ రైతుబంధు గురించి మాట్లాడుతున్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని దీవించండి. ప్రతిపక్షాల మాటలు నమ్మకండి. ప్రతిపక్షాల తిట్లను దీవెనలు తీసుకుందాం అని కేటీఆర్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా ఆగని కరోనా విజృంభణ

### 24 గంటల్లో 9985 మందికి కరోనా వైరస్
### ఒక్కరోజులో 279 మంది మరణించినట్లు కేంద్రం వెల్లడి
### జూలై నాటికి పదిలక్షలకు చేరుకుంటుందన్న అంచనాలు

న్యూఢిల్లీ,జూన్10(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా కూడా కరోనా విజృంభించనుంది. జులై నెలాఖరు నాటికి 8 నుంచి 10 లక్షలకు పెరగొచ్చు అని శివనాడార్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సమిత్ భట్టాచార్య తెలిపారు. లాక్డౌన్ సడలింపుల తరువాత కరోనా కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్న అంచనాల మేరకు ఆయన తెలిపారు. తాజా అంచనాల ప్రకారం జులై చివరి నాటికి 10 లక్షలకు చేరొచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో మహమ్మారి మరింతగా విజృంభించే అవకాశాలున్నాయని అంటున్నారు. జులై చివరి కల్లా ఒక్క ఢిల్లీలోనే 5.5 లక్షల కేసులు వెలుగు చూస్తాయని అంచనా వేశారు. రాజధాని ఢిల్లీలో సుదీర్ఘ లాక్డౌన్ విధించినా కరోనా వ్యాప్తి పెరిగింది. అందులోనూ చాలా కేసుల్లో వారికి ఎలా వైరస్ సోకింది అనేది అర్థం కాకుండా ఉంది అని కోల్‌కతాకు చెందిన సీఎస్ఆర్-ఐఐసీబీ శాస్త్రవేత్త ఉపాసన రే పేర్కొన్నారు. దేశంలో గత 24 గంటల్లో 9985 మందికి కరోనా వైరస్ సంక్రమించి నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. గత 24 గంటల్లోనే 279 మంది కూడా మరణించినట్లు పేర్కొన్నది. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం వైరస్ కేసుల సంఖ్య 276583గా ఉంది. దీంట్లో 133632 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. 135206 కేసులు రికవర్ అయినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొన్నది. దేశంలో ఇప్పటి వరకు కోవిడ్19 వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి మొత్తం సంఖ్య 7745గా ఉందని ప్రభుత్వం పేర్కొన్నది.

ఇక వైరస్ శ్యాంపిల్ పరీక్షలు దేశంలో 50 లక్షలు దాటినట్లు ఐసీఎంఆర్ తెలిపింది. గత 24 గంటల్లో దేశంలో 142216 మందికి వైరస్ పరీక్షలు నిర్వహించినట్లు ఐసీఎంఆర్ పేర్కొన్నది. భారత్‌లో రికవరీ కేసుల సంఖ్య పెరుగుతున్నది. యాక్టివ్‌గా ఉన్న కేసుల కన్నా.. రికవరీ కేసులు ఎక్కువగా ఉన్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో రికవరీ రేటు 48.9 శాతంగా ఉన్నట్లుగా ప్రభుత్వం పేర్కొన్నది.

## టెన్త్‌లో అందరూ పాస్

### -ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్,జూన్10(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పదో తరగతి పరీక్షలను రద్దు చేసిన ప్రభుత్వం తాజాగా విద్యార్థులందరినీ పాస్ చేస్తున్నట్లు జీవో జారీ చేసింది. జిల్లా పరిషత్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ విద్యార్థులందరినీ పాస్ చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణలో టెన్త్ విద్యార్థులకు ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా గ్రేడ్స్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కరోనా విజృంభిస్తుండటం, కేసులు నానాటికీ పెరుగుతుండడం, హైకోర్టు ఆదేశాలు.. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పదో తరగతి పరీక్షలు రద్దు చేయడమే మేలని భావించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 1969-70లో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగడంతో అప్పుడు పదో తరగతి విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా అందరినీ పాస్ చేస్తున్నట్టు ఉమ్మడి రాష్ట్రంలోని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం కరోనా పరిస్థితుల

నేపథ్యంలోనూ తెలంగాణ ప్రభుత్వం అలాంటి నిర్ణయమే తీసుకుంది. గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో రికార్డు స్థాయిలో 92.43 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అడ్వాన్స్ సప్లమెంటరీ ఉత్తీర్ణత కలుపుకుంటే మొత్తం 98శాతం పైబడే ఉంటుంది. అంటే మొత్తంగా ఫెయిలైన విద్యార్థులు కేవలం 2శాతంలోపే ఉంటారు. ఈ గణాంకాల ఆధారంగా ఈ సారి కూడా అంతే ఉత్తీర్ణత నమోదవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అందరినీ పాస్ చేయడమే మేలనే ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది.

## డివైడర్‌ను ఢీకొన్న బైక్: యువకుడు మృతి

హైదరాబాద్,జూన్10(ఆర్ఎన్ఎ): జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10లో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం ఓ యువకుడు బైక్‌పై రోడ్ నెంబర్ 10 మీదుగా వెళ్తున్నాడు. మితిమీరిన వేగంతో వెళ్తున్న యువకుడి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడి తలకు తీవ్రగాయాలవడంతో ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

## చరిత్రలో నేటినిజం



సీ॥ మదనుని జనకుడు బ్రోచును-
పదుగురికై బ్రతుకు 'మేకపాటి' కులమునన్
సదమల వర్తి చరించుచు
ముదముల నందించు "రాజమోహనరెడ్డి"నే!!

(జూన్ 11 మేకపాటి రాజమోహనరెడ్డీ జననం)

-రాధశ్రీ

సెల్: 9494481210



## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

### చెక్‌డ్యామ్ నిర్మాణాలకు శంకుస్థాపనలో మంత్రి సబిత

రంగారెడ్డి,జూన్10(ఆర్ఎన్ఎ): గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లాలోని శంకర్ పల్లి పట్టణంలో మూడు కోట్ల రూపాయలతో నిర్మించనున్న నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక శాసన సభ్యుడు కాలె యాదయ్య, జడ్పీ చైర్ పర్సన్ అనితా రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే ముబారక్ పూర్, గంగ్యడ గ్రామాల్లో నాలుగు కోట్ల రూపాయలతో చెక్ డ్యామ్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టి భూగర్భ జలాల పెంపునకు టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తూ రైతును రాజును చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు వేసి లాభాలు పొందాలన్నారు. కెసిఆర్ కృషి పట్టుదల కారణంగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కావచ్చాయని, తెలంగాణ రాష్ట్రం దేశానికే ధాన్యాగారంగా మారిందని మంత్రి అన్నారు.తెలంగాణలో బంగారం లాంటి సారవంతమైన నేలలు ఉన్నాయని, చెరువుల కింద రెండు పంటలు పండించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. నీళ్ల లేక నోళ్లు ఎండబెట్టిన చెరువులు, కుంటలు ఎండా కాలంలోనూ చెరువులు మత్తడి దుంకుతున్నాయన్నారు.

యువత వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలనే రైతులు వేయాలి. మద్దతు ధరకు మించి రైతులకు పైసలు రావాలి. అందరూ ఒకే పంట వేస్తే రైతులు నష్టపోతారని సబిత అన్నారు. దళారుల చేతుల్లో రైతులు మోసపోకూడదన్నదే సీఎం ఆలోచనని వివరించారు. రైతుబంధు పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపే ప్రసక్తే లేదన్నారు.

## కరోనా తీవ్రత ఉన్నా డిశ్చార్జ్ అవుతున్న వారూ ఎక్కువే

### ఊరట కలిగించేలా కోలుకుంటున్న వారి సంఖ్య

న్యూఢిల్లీ, జూన్ 10 (ఆర్ఎన్ఎ):భారత్‌లో కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతున్న కరోనా రికవరీ రేటు కూడా అదే విధంగా ఉంటోంది. రోజుకు వేల సంఖ్యలో కేసులు బయటపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గడచిన 24 గంటల్లో 9985 కేసులు నమోదయ్యాయి. దీంతో దేశంలో కరోనా బాధితుల సంఖ్య 2,76,583కు చేరింది. ఇదిలా ఉండగా దేశంలో కొవిడ్ నుంచి కోలుకున్న వారి సంఖ్య కూడా క్రమంగా పెగుగుతోంది. కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. తొలిసారిగా బాధితుల కంటే కోలుకున్న వారి సంఖ్య పెరగడం ఊరట కలిగిస్తోంది. ఇప్పటి వరకూ దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం కేసుల్లో సగానికిపైనే బాధితులు కోలుకున్నారు. మొత్తం బాధితుల్లో 1,35,206 మంది పూర్తిగా కోలుకుని ఇళ్లకు వెళ్లగా.. ఇంకా 1,33,632 మంది వివిధ కొవిడ్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వెల్లడించింది. మరోవైపు మృతుల సంఖ్య 7,745కు చేరినట్లు తెలిపింది. ఇక ప్రపంచంలో అత్యధిక కరోనా కేసులు నమోదవుతున్న దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉంది. అమెరికా, బ్రెజిల్, రష్యా, యూకేలు మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. మరోవైపు మరణాల రేటులో భారత్ 12వ స్థానంలో కొనసాగుతోంది.

ఇక దేశంలో అన్ని రాష్ట్రాల్లోకంటే మహారాష్ట్రలోనే అత్యధిక కేసులు నమోదవుతున్నాయి. ఆ రాష్ట్రంలో ఇప్పటి వరకు 90 వేలకు పైనే కేసులు బయటపడ్డాయి. ఇక మృతుల సంఖ్య 3289గా ఉంది. ఆర్థిక రాజధాని ముంబయి మహా నగరంలోనే ఇప్పటి వరకు 51వేల కేసులు బయటపడటం అక్కడ తీవ్రతకు అద్దంపడుతోంది.

# తెలంగాణను వదలని మిడతల దండు

### దండు ప్రమాదంపై అధికారులతో సమీక్ష
### 8జిల్లాలు అప్రమత్తంగా ఉండాలన్న సిఎం కెసిఆర్

హైదరాబాద్,జూన్10(ఆర్ఎన్ఎ): రాష్ట్రానికి మిడతల దండు ప్రమాదం మరోసారి పొంచి ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. మిడతల దండు నుంచి రాష్ట్రాన్ని రక్షించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు సీఎం పేర్కొన్నారు. మిడతల దండు నుంచి కాపాడే చర్యలపై ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. మిడతల దండు గమనంపై సమాచారాన్ని తెప్పించుకొన్న సీఎం అధికారులతో చర్చించారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు అలర్ట్‌గా ఉండాలి. ఎప్పటికప్పుడు పరిస్థితిని గమనించి చర్యలు తీసుకోవాలి. మిడతల దండు దాడి చేసిందంటే చాలా నష్టం. లేత పంటను పీల్చి పారేస్తుంది..ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణలోకి మిడతల దండు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం కేసీఆర్ సూచించారు. గత నెలలో మూడు విడతలుగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వరకు మిడతలు వచ్చాయి. తెలంగాణ వైపు మిడతలు రాలేదు. తాజాగా ఓ మిడతల దండు తెలంగాణ సమీపంలోకి వచ్చింది. రాష్ట్రానికి 200 కిలోమీటర్ల దూరంలో మహారాష్ట్రలోని రాంటెక్ దగ్గర అజ్ని అనే గ్రామం దగ్గర ప్రస్తుతం మిడతల దండు ఉంది. దాని ప్రయాణం దక్షిణం వైపు సాగితే చాలా తక్కువ సమయంలో తెలంగాణలోకి ప్రవేశించే ప్రమాదం ఉందని సీఎం వివరించారు. ఈ నెల 20 నుంచి జూలై 5 వరకు మిడతలు వచ్చే అవకాశం ఉన్నది. మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సరిహద్దులోని 8 జిల్లాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. . భద్రాచలం, చర్ల, వెంకటాపురం, వాజేడు, పేరూరు, మంగపేట, ఏటూరు నాగారం, చెన్నూరు, వేమనపల్లి, కౌటాల, ధర్మాబాద్, బోధన్, జుక్కల్, బాన్సువాడ, నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల నుంచి మిడతల దండు వచ్చే ప్రమాదం ఉందన్నారు.

మళ్లీ మిడతల దండు వచ్చే అవకాశం ఉందని నిపుణులు తేల్చినట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో పంటలు మొలకెత్తి ఉంటాయని, మిడతల దండు దాడి చేసిందంటే చాలా నష్టం జరుగుతుందని వివరించారు. రాష్ట్రంలోకి మిడతల దండు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కేసీఆర్ సూచించారు.

## కేదార్‌నాథ్ ఆలయ అభివృద్ధి పనులు సమీక్షించిన మోదీ



న్యూఢిల్లీ,జూన్10(ఆర్ఎన్ఎ): పర్యావరణహితంగా కేదార్‌నాథ్ ఆలయ అభివృద్ధి పనులను చేపట్టాలని ప్రధాని మోదీ సూచించారు. ఇక్కడి అభివృద్ధి పనులపై బుధవారం ప్రధాని సమీక్షించారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆలయాన్ని అభివృద్ధి, పునర్ నిర్మాణం కోసం విజన్‌తో పని చేయాలని ప్రధాని మోదీ ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఉన్న కేదార్‌నాథ్, బద్రీనాథ్ లాంటి ఆలయాల అభివృద్ధి కోసం కూడా ప్రణాళికలు వేయాలని, పర్యావరణ హితమైన ఏర్పాట్లు చేయాలని ప్రధాని సూచించారు. రాంబన్ నుంచి కేదార్‌నాథ్ మధ్య ఉన్న అనేక వారసత్వ, మతపరమైన ప్రదేశాలను కూడా అభివృద్ధి చేయాలని మోదీ ప్రత్యేక సూచన చేశారు. కేదార్‌నాథ్ ఆలయ రీడెవలప్‌మెంట్‌తో పాటు పలు పనులను మోదీ సమీక్షించినట్లు పీఎంవో కార్యాలయం పేర్కొన్నది. ప్రస్తుతం పర్యాటకులు లేని కారణంగా.. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయాలని మోదీ సూచించారు. బ్రహ్మ కమల వాటిక అభివృద్ధి గురించి కూడా మోదీ .. అధికారులను అడిగి తెలుసుకున్నారు. మ్యూజియం, వాసుకీ తాల్, టౌన్ క్వార్టర్స్ అభివృద్ధి లాంటి వాటి గురించి కూడా ఆయన అడిగారు. ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్‌తో పాటు సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## జన్వాడ ఫామ్‌హౌజ్ నాది కాదన్న కెటిఆర్

### ఎన్జీటి ఆదేశాలపై స్టే విధించిన హైకోర్టు

హైదరాబాద్,జూన్10(ఆర్ఎన్ఎ): జన్వాడలో ఉన్న ఫామ్ హౌస్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతున్నది. కేటీఆర్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని, పర్యావరణానికి హాని కలిగించే విధంగా ఫామ్ హౌస్ నిర్మాణం ఉందని చెప్పి కాంగ్రెస్ పార్టీ ఎంపీ రేవంత్ రెడ్డి ఎన్జీటీలో కేసు ఫైల్ చేశారు. జీవో 111 కు విరుద్ధంగా ఫామ్ హౌస్ నిర్మించారని రేవంత్ రెడ్డి తన పిటిషన్లో పేర్కొన్నారు. దీంతో ఎన్జీటీ మంత్రి కేటీఆర్ కు నోటీసులు జారీ చేసింది. కేటీఆర్ తో పాటుగా తెలంగాణ సర్కార్‌కు, పీ సీ బీ, హెచ్ ఎం డీ ఏ లకు నోటీసులు జారీ చేసింది. అంతేకాకుండా, ఎన్జీటీ కేంద్ర పర్యావరణ ప్రాంతీయ అధికారి నేతృత్వం లో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసింది. దీనిపై రెండు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై మంత్రి కేటీఆర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఎన్జీటీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని, ఫామ్ హౌస్ తనది కాదని చెప్పి మంత్రి కేటీఆర్ తన పిటిషన్ లో పేర్కొన్నారు. దీనిపై విచారించిన కోర్ట్, రేవంత్ రెడ్డి పిటిషన్ పై ఎన్జీటీ జారీ చేసిన ఉత్తర్వులపై స్టే విధించింది.

## జిల్లాలో మరో ఇద్దరికి కరోనా

నాగర్‌కర్నూల్,జూన్10(ఆర్ఎన్ఎ): జిల్లాలోని బల్మూర్ మండలం వీర రామాజిపల్లికి చెందిన వ్యక్తి కరోనాతో మృతి చెందాడు. అతడి అంత్యక్రియలకు హాజరైన14 మంది వ్యక్తుల శాంపిల్స్ సేకరించి కరోనా నిర్ధారణ పరీక్షలకు పంపించారు. పరీక్షల్లో అదే గ్రామానికి చెందిన ఇద్దరికి కరోనా పాజిటివ్ గా నిర్ధారణ అయిందని, మిగతా12 మందికి కరోనా నెగిటివ్ రిపోర్టులు వచ్చాయని జిల్లా కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. ప్రజలందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలని కలెక్టర్ కోరారు. కరోనా తీవ్రతను గుర్తించి ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు దుకాణాల్లో గుంపులు గుంపులుగా ఉండకూడదని తప్పనిసరిగా భౌతిక దూరాన్ని పాటించాలన్నారు.




## వాసా ఫౌండేషన్
మరియు
నేటినిజం దినపత్రిక



సంయుక్త ఆధ్వర్యంలో

ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి

### స్మారక కవితల పోటీలు

కరోనా మహమ్మారి విజృంభణ నేపథ్యంలో ప్రజలెదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై దృష్టి సారించి

## "వలస కార్మికులు"

అన్న అంశం మీద మీ కవితాస్త్రాల్ని సంధించండి

**బహుమతుల వివరాలు:**

- మొదటి బహుమతి : రూ. 5000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- రెండవ బహుమతి : రూ.2,500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- తృతీయ బహుమతి : రూ.1,000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- 10 ప్రోత్సాహక బహుమతులు : రూ.500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం

బహుమతులు గెలుచుకున్న కవితలతో పాటు ప్రచురణకు ఎంపిక చేసిన కవితలను 'నేటినిజం'లో ప్రచురించబడును.

**నిబంధనలు:**

1) కవిత 25 లైన్లకు మించకూడదు.
2) వలస కార్మికుల సమస్యలపైనే ఉండాలి
3) అనువాద కవితలు పోటీకి అంగీకరించబడవు
4) కవితను ఏ పత్రికకు పంపలేదని, సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని ఈపోటీ నిమిత్తమే రాసినదని హామీ పత్రం తప్పక జత చేయాలి.
5) హామీ పత్రంతో మీ పేరు, పూర్తి చిరునామా తప్పని సరి.
6) ఒకరు ఒక కవితను మాత్రమే పంపవలెను.

**కవితలు పంపవలసిన చిరునామా:**
'నేటినిజం' దినపత్రిక, ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20.
E-mail : netinijam2020@gmail.com

**కవితలు పంపాల్సిన చివరి తేది: 15- 7- 2020**

నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com

గురువారం 11-6-2020    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    హైదరాబాద్ 3


నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజం

## నమ్మలేని నిజాలు

బంగారు రాష్ట్రం
శూన్యంలో పథకాలు
16అణాల మాట.

భయం చావుకి
కర్మసిద్ధాంత దేశం
రోడ్లపై జనం.

గ్రహ ఫలాలు
కాలసర్ప యోగాలు
అంతటా బీభత్సం

అంతా ఉచితం
ఒక పొడుపు కథ
దేవరహాస్యం.

నల్లకలువ
అస్తిత్వ పోరాటాలు
విజయీభవ



– రేడియమ్
సెల్: 9291527757

## శ్రీనిజాలు

చదువు రక్తి తక్కువైంది
తెరువలేదు బళ్లు !
భక్తి రసం ఎక్కువైంది
తెరిచినారు గుళ్లు !

పూజచేసి కోరుకోండి
కరోనాని పోపొమ్మని !
బళ్లుతెరిచి పిలువవచ్చు
పిల్లల్నీ రారమ్మని !



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజంనేటినిజం నేటినిజంనేటినిజంనేటినిజం

## నేను, రామ్ మహమ్మద్ సింగ్ ఆజాద్‌ను

నాకు
కాక్స్‌టన్ హాలు దగ్గర
కాలం కలిసి వచ్చింది
ఈస్ట్ ఇండియా అసోసియేషన్
సెంట్రల్ ఏషియన్ సొసైటీ
ఒక సమావేశమై అవకాశమిచ్చింది
నేను కాల్చాను
అతన్ని కాలుస్తూ ఉన్నప్పుడు
నెత్తురోడిన కుసుమించని మొగ్గలు
ట్రిగ్గర్ మీద వేలు నొక్కారు
అప్పుడప్పుడే గడపదాటడం నేర్చుకున్న
అసహాయపు ఇంటిదీపాలు
హృదయతంత్రుల్లో మెలిపెట్టారు
ఉడిగిన వయసును ఉత్తరీయంలో దాచుకొని

స్వతంత్రేచ్ఛను కలగన్న పరిణత వయస్కులు
మేధో పీఠిని పట్టికుదిపారు.

జలియన్ వాలాబాగ్
హాహా కారాలు
రక్తధారలు
తప్పించుకోలేని దైన్యాలు
దిక్కుతోచని బేలతనం
గుండె నుండి ఎగసి
కన్నీరై కారి
తుపాకీ ఐ పేలింది.

స్తన్యం కోసం వెతులాడే లేత మోములు
మొగ్గల కోసం పరితపించే పూరెమ్మల పలవరింతలు
చావుకూ బతుక్కూ నడుమ
తండ్లాడుతున్న ఆర్తనాదాలు
శ్వేత జాతి అహంకారాన్ని అంతమొందించమన్నై.

ఇరవయ్యొక్క యేళ్ళ వ్యథ
జీవిత కాలపు కసి
సూర్యాస్తమయం లేని
గుడ్డి అహంకారం మీద క్రోధం
ఒక దయ్యర్ను కాదు

వలసవాద తత్వాన్ని కాల్చాను.

దయ్యర్ ఒక మిష
నేను జాత్యహంకారాన్ని కాల్చాను
నా జాతి జనులు
నిప్పుల్లో మాడుతుంటే
పగబట్టడం నా బాధ్యత
స్వాతంత్ర్యం మీరిచ్చేది కాదు
మేం గుంజుకుంటం.

న్యాయం తెల్లతోలు కప్పుకున్న
కసాయిదైనప్పుడు
ధర్మం సామ్రాజ్యవాద
పదఘట్టనల కింద నలిగినప్పుడు
మహాహంతకుడు నేరస్తుడు కాడు
కృష్ణమీనన్ వాదించి బెంగపడవచ్చు
ప్రాసిక్యూషన్ మహావేగంగా
ట్రాయల్ చేయవచ్చు
నన్ను మీరు ఉరి తీయవచ్చు
చావు నా ఇంటి వాకిలి ముందు
కట్టివేయబడ్డ కుక్కపిల్ల

జాతికొరకు నేను మరణిస్తాను.

అకారణంగా అసువులు బాసిన
వేలమంది అమాయకుల ఆత్మను నేను
కారణం తెలియని కాల్పుల్లో
బుగ్గైపోయిన పొలికేకను నేను
మిస్టర్ అట్‌కిన్‌సన్
నన్ను ఉద్ధవ్‌సింగ్ అన్నట్టున్నావ్
నాపేరు రామ్ మహ్మద్ సింగ్ ఆజాద్
నేను హంతకున్ని మాత్రమే

నేరస్తున్ని కాదు
మాతృభూమి పదసేవలో
ప్రాణాల్ని గడ్డిపరకను చేయడం కన్నా
గౌరవం ఇంకేముంటుంది
నువ్వేసే శిక్షను నేనే ప్రకటిస్తున్నాను
నేను ఉరికంబానికి ఊయలూగుతాను.

స్వతంత్ర భారత సౌధంపై
వెలిగే దివ్వెనవుతాను.



– ఏనుగు నరసింహారెడ్డి
8978869183

## పోగు లెక్కలు

మగ్గం
మరణశయ్య నెక్కింది
నేతన్నల ఆశలన్నీ
దింపుడు కళ్ళం చూపులు
కరోనా
క్వారంటైన్‌ల కలనేత
బతుకు వాకిళ్ళను
తెర్లుతెర్లు చేసింది
ఆకలి ఎండలకు
చేనేత బతుకులన్నీ
పగుళ్తున్న పత్తిగూళ్ళు
చుక్కలు దిగనేసినోనికి
పట్టపగలే కనిపిస్తున్నై
చక్కర్లు కొట్టే 'సట్టర్లు'
తిరిగే 'రాట్నం' చక్రాలు
ఆగకుండా కదిలే 'ఆసులు'
ఆకలి రామకోటి రాస్తున్నై
అట్లుకట్టిన
గంజి కుండలు
ఇరుగుగున్న 'పిడిశెలు'
అలుకుపూతల్లేని
పొయ్యిల్ల పిల్లి కాపురాలు
ఎన్ని బక్క బతుకుల్లో
పుంజాలు లెక్క తప్పాయో
ఎన్నెన్ని ఎముకల గూళ్ళు
పట్టున పగిలిపోయాయో
'సరి'కి ముందే
'చిట్టెలు' ఎన్ని తెగినయో....
కొలత తెలియని
చావుల లెక్కలు
దారాన్నీ వదలని
కోవిద్ కొత్త రంగులు
ఇంకెన్ని పానాలను
కబలించి వేస్తుందో...
రైతూ... రోజుకూలీ
కార్మికుడు... నేతన్న
సంపదల నిర్మాతలైన
పేద బతుకులన్నీ
ఆగమాగం అయినై
నిన్నటిదాకా కదిలిన జీవితాలు
మూకుమ్మడిగా లాక్‌డౌన్లైనై
తాన్లకు తాన్లుగా
బతుకు పాసంగాలు
తప్పక ముందే కదలాలె
'పోగు' తెగక ముందే
దారాల్ని ముడెయ్యాలె!



– డా. పత్తిపాక మోహన్
9966229548

## రాయాలంటే ...


రాయాలంటే
మనం రాయవల్సిందేదో
మొదట మనకు తెలియాలి
దేనికోసం రాస్తున్నామో
ఏ ప్రయోజనం కోసం రాస్తున్నామో
మనం నిర్ధారించుకోవాలి !

మనకు తెలిసిందల్లా రాసేస్తామంటే
మనకంటే తెలివైనవాళ్లు
కొట్టిపారేస్తారు ! ఉతికి ఆరేస్తారు !
మనకు తెలియనిది
తెలిసినట్టుగా రాసేస్తామంటే
మనకంటే తెలివితక్కువవాళ్ళు కూడా
మనల్ని ఎగతాళి చేస్తారు
గేళిచేసి అవమానిస్తారు !

రాయాలంటే
మొదట మనం అధ్యయనం చేయాలి
తీవ్రంగా మదింపు చేయాలి

ముడిసరుకు బుర్రలో కుక్కి
రూపసరుకు బయటకు రప్పించాలి

అప్పుడే మనం రాసిందానికి విలువ
మనం చెప్పిందానిపై మక్కువ !



-పి.లక్ష్మణ్ రావ్
9441215989

## కళా వైభవాన్ని చాటే నృత్య రూపకాలు

ప్రముఖ చిత్రకారులు.. కూచిపూడి నృత్య రూపక రచయిత 'బ్నిం' 'బ్యాలేలు' పేరుతో ఓ నృత్య రూపక సంకలనాన్ని వెలువరించితమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు.రెండు వందల యాభైపైనే నృత్య రూపకాలు రచించిన 'బ్నిం' ఎక్కువశాతం పౌరాణిక కథలకే పెద్దపీట వేసినప్పటికీ.. సామాజిక అంశాలపై కూడా రాసి అందరి మన్ననలు పొందారు.నృత్య ప్రధానమైన రచనలు చేయడంలో అపార అనుభవం సాధించిన 'బ్నిం' చిన్నతనంలోనే మన సంస్కృతి ప్రతిబింబించే గ్రంథాలను చదివారు. అప్పటి నుంచే సంస్కృతం. సంగీతం సాహిత్యం పట్ల మక్కువ చూపి.. మాత్రా ఛందస్సులో గేయ రచనకు శ్రీకారం చుట్టారు. గత మూడు దశాబ్దాలుగా నృత్య రూపకాలకు జీవం పోస్తున్న ఆయన.. కూచిపూడి నట్యాచార్యులు వారి శిష్యగణం దృష్టి నాకర్షించినారు.వారు కోరిన రీతిలో రచన చేసి మెప్పించిన అనుభవం ఆయనకున్నది. సందేశాత్మకంగా, ప్రబోధాత్మకంగా రాసిన ఆయన రచనలు, దరువులు పలువురి మన్ననలు పొందాయి. విదేశాల్లో సైతం 'బ్నిం'చే నృత్య రూపకాలు రాయించుకోవడం విశేషం! తాను రాసిన నృత రూపకాలకు మొట్టమొదట శ్రీ పెద్దుల నరసింగరావు అనే ఆయన ప్రోత్సహించినట్లు 'బ్నిం' తన మాటలో చెప్పుకున్నారు. ఆ తర్వాత పలువురు ఆయనచే రాయించుకుని సంగీతం.. స్వరం జోడించి రమణీయ నృత్య ప్రదర్శనలకు ఉపక్రమించిన వారెందరో ఉండటం గమనార్హం. డా॥ జొన్నలగడ్డ అనురాధారెడ్డి, పద్మజారెడ్డి, స్వాతి తదితరులు పరిచయంలోకి రావడానికి డి.ఎస్.వి. శాస్త్రిగారు ఎంతగానో సహకరించినట్లు స్వయంగా 'బ్నిం' చెప్పుకున్నారు. తాను 'కళారత్న' బిరుదు తెచ్చుకునే వరకు మద్దాలి (కిన్నెర) రఘురామ్‌గారు వారి శ్రీమతి మద్దాలి ఉషాగాయత్రిగారి సహకారంతో




అనేక నవీన అంశాలపై దృష్టి సారించి నృత్య రూపకాలను తీర్చిదిద్దారు. అనేక మంది ప్రముఖులు కళారంగంలో.. సాంస్కృతిక రంగంలో.. నృత్యరంగంలో ఆయన రూపకాలకు విలువనిచ్చి ప్రదర్శనలు ఏర్పాటు

**పుస్తక సమీక్ష**

చేయడం శ్లాఘనీయం. అంతేగాక 'బ్నిం' రూపకాలకు అనేక మంది స్వర రాగకర్తలు వేలాది ఆయన పాటలకు స్వరం సమకూర్చారు. నృత్య రూపకాలు 250కిపైగా రచించిన 'బ్నిం' 'బ్యాలేలు' పేరుతో ప్రస్తుతం మనకు అందిస్తున్న గ్రంథంలో ఓ పదకొండు (11) అంశాలకు సంబంధించిన నృత్య రూపకాలను పొందుపరిచారు. శకుంతల, కాళీయ మర్దనం, శ్రీఖండస్థాణువు, మేనకా విశ్వామిత్రమ్, సిద్ధార్థ, గజేంద్రమోక్షం, శ్రీనివాస కళ్యాణం, బాలం ముకుందం, వాల్మీకి, నాగకన్య మరియు భక్త కన్నప్ప నృత్య రూపకాలను ఈ గ్రంథంలో నిక్షిప్తం చేశారు. ప్రతి రూపకం ప్రదర్శన యోగ్యంగా, గాన యోగ్యంగా, రమణీయంగా కళాకారులు తమ ప్రతిభను నృత్య రూపంలో గాన రూపంలో చాటుకోవడానికి వీలుండేలా తీర్చి దిద్దబడింది.

'బ్నిం' ఈ రూపక ప్రదర్శనలద్వారా చారిత్రక, సాంస్కృతిక, అంశాలపై అవగాహన పెంచే ప్రయత్నం చేశారు. ప్రదర్శించడానికి వీలుగా రచనను కొనసాగిస్తూ.. అవసరమైన మార్గదర్శక సూత్రాలను సందర్భోచితంగా ఆయా రూపకాల్లో పొందుపరిచారు. పెద్దుల నర్సింగ్‌రావ్‌గారికి రాసిన నృత్య రూపకాలు ఎక్కువ ఉండటం విశేషం. ఈ రూపకాలను సశాస్త్రీయంగాను, సలలితంగాను సరళమైన రీతిలో మనోధర్మం ఆధారంగా రచించారు. పురాణ కథలలోనూ సామాజిక ప్రయోజనాన్ని నర్మగర్భంగా కాంక్షించి రాయడం విశేషం. అంతేగాక స్త్రీల ఔన్నత్యాన్ని చాటి చెప్పడానికి ఈ రూపకాలు దోహదపడతాయి. అందమైన ముఖచిత్రంతో సనాతనం ఆధునికం మేళవించి..శాస్త్రీయంగా రాయబడిన ఈనృత్య రూపకాలు ప్రదర్శించి కళాకారుల ప్రయోజనం పొందాలని వారి ప్రదర్శనల ద్వారా సమాజంను అలరింపజేయాలని కోరుకుందాం. ఈ సందర్భంగా 'బ్నిం'ను అభినందిద్దాం.

**ప్రతులకు:** బ్నిం
12-11-1364, పారశర అపార్టుమెంట్స్
బౌద్ధనగర్, వారాసిగూడ,
సికింద్రాబాద్-500 061
ఫోన్: 8341450673



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## వృధార్థులు

తే.గీ: కుండ కరిగించి కరిగించి బండలెత్తి
బండలను గూడ గరిగించు ఎండలందు
చెమట చిందించగల కష్టజీవులెల్ల
నింపుతున్నారు కనుల కన్నీరు నేడు.

తే.గీ. చావు ఒకసారి మనిషిని చంపగలదు
మూడు పొద్దుల క్షుత్తు చంపుంగదయ్య
ఆకలికి మందు-పిడికెడంతన్నమైన
లేని బాధలు రెట్టింపులైన విపుడు.

ఉ. ఆకలి కోరలందొదిగి అన్నమొ రాముల యంచు పాడు ఎ
న్నోకథలుండగా-ఇపుడు నోటికి బువ్వను నోచుకోక పెం
జీకటి లోన చిక్కి నివసించుచునున్న జనాలు హెచ్చె-ఈ
లాకులు డౌనులందు-జనులన్ దిగజార్చినదింతకింతకున్

తే.గీ. బయట కాల్వెట్టగ కరోన భయము పుట్టె
కొంపలో గొదరక్కసి చంపవట్టె
దేశమెండిన పిండిన తేనె తుట్టె
కడుపు మంటలో బతుకులు కాల వట్టె

మ. శరణో దీనదయాళ! అన్నముగ సాక్షాత్కారముం జూపి నె
త్తురులన్నింపవే గుండెకాయలకు-శక్తుల్ నిండి కొల్వన్ పరా
త్పర! నీవున్న నిజమ్ము చాటుమని పేదల్ మొక్కుచుండంగ గే
హరమున్ మూసికొనంగజొచ్చెనిది అన్యాయంబు గాబోదొకో?

తే.గీ వేయిచేతులనెత్తి గుప్పించుచుండె
పూషదుగ్రుడై చంద్ర నిప్పులను బయట
వేయి పిడుగుల రుచులు జూపించుచుండె
దారుణమ్ముగ ఆకొన్నతనము యింట.

ఆ.వె కడుపుకింత బువ్వ గలదేని-అన్యమా
శించబోని నరుల పెంచుకొనుచు
యేడ్చుచుండె దేశ మిన్నాళ్ల స్వాతంత్ర్య
మునకు-మేను మరిచి పొంగి పోక

క. రెక్కలనాకటి కత్తికి
ముక్కలు గావించి-పొద్దు పోయిన వేళన్
చిక్కిన కష్ట ఫలమ్మును
బుక్కలుగా దినును కష్టపోతులు సతమున్

ఆ.వె. రెక్కలాడెనేని డొక్కలో తిండి తి
ప్పలకు కరువు లేదు-పాడు కాల
మిద్ది-ఇంటిలోనె మిడుకుచునుండగా
పొద్దు పోవుటెట్లు? ముద్దయెట్లు?

ఆ.వె. పుండు మీద పసరు పూసినట్లుగ- కొంత
సాయపడెను ప్రభుత-చాలకుండె
ఒంటిలోని రక్తమూడ్చిన క్షుద్భూత
మానుచుండె కంటిలోని నీరు

మ. నెనరుంగల్గిన మానవోత్తములు-కన్నీటిన్ భరింపన్ గిర
స్తనికే మాత్రము మంచి గాదని దయాదాక్షిణ్యమున్ జూపి ముం
దున నిల్చెన్ తగురీతిసాయపడి-నీతుల్ జెప్పి తప్పించు కుం
ద్రు నటుల్ పెక్కురు నాయకాగ్రణులు-చేతుల్ రాని కోటీశ్వరుల్

తే.గీ. పదవులాశలు లేవు-ఐశ్వర్యములకు
చేతులను చాచలేరు-కష్టించి బతుకు
బండి నడిపించుకొనువారు-పనిని జూప
నదియె పదివేలు కూలీ జనాలకెల్ల.



-తోకల రాజేశం
సెల్: 9676761415

## ప్రణామం

చరిత్రకే ఆణిముత్యమా !
సృష్టికే ఆరాధ్య దైవమా!
ధరణిలో మానవత్వ ప్రతిరూపమా!
దైవత్వం ధరించిన మనిషి రూపమా !
వైద్యుడా ! ఓ వైద్యుడా !
ప్రణామం ప్రణామంనీ సేవకు !
ప్రణామం ప్రణామం నీ తెగువకు !!.

నీ తోడుదే కదా జననం
నిన్ను దాటితేనే కదా మరణం
కనిపించని యుద్ధంలో
కనిపించే ధైర్యం
కమ్ముకున్న కరోనా
చీకటిని చీల్చే దీపం
నువ్వే కదా ప్రత్యక్ష దైవం.

ముప్పు నిన్నే తాకుతున్న
నిప్పు కణికవై లేచి
ఉక్కు పిడికిలి బిగించి
తెల్ల కోటు ధరించావు
ఓర్పుతోనే నేర్పుగా
సమరం సాగిస్తున్నావు.

ఇంటికి నువ్వు దూరమైనా
కంటికి కునుకు భారమైనా
రక్షణ కవచాలే ప్రతి బంధాలై
నిన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా
ప్రాణ దాతవై ఊపిరి పోస్తూ
ప్రజా సేవకుడివై వైద్యం చేస్తున్నావు.

ఒత్తిళ్ళు సవాలు విసిరినా
సహనం,సాహసం నీ ఆయుధాలై
పోలీసులు,సఫాయిలు రక్షణ దళమై
వైద్యాలయ సిబ్బంది నీ సైనికులై
కనిపించని శత్రువుతో
కలబడి యుద్ధం చేస్తున్నావు.

పేగును పంచిన తల్లిని మించిన
ప్రేమను మాకు పంచావు
తోడబుట్టక పోయినా
తోడుగా నిలిచావు
పంచుకు పుట్టలేదు మా రక్తం
చిందించావు మా కోసం నీ రక్తం
మరువదు నిన్ను ఈ లోకం
చెరగదు ఎన్నటికి నీ త్యాగం
ప్రణామం ప్రణామం నీ సేవకు !
ప్రణామం ప్రణామం నీ తెగువకు !!



– డాక్టర్ రానవేయిన రమేష్
9849294694

## నల్ల మబ్బుల నుండి నెత్తుటి ధారలు రాలుతున్నాయి..!



– కత్తి పద్మారావు
సెల్:9849741695

నల్లకడలి నుండి అగ్నికణాలు లేస్తున్నాయి
నదీ తరంగాల నుండి విద్యుత్తు వస్తుంది
నల్లసింహాలు బానిస గుహల నుండి
బయటకు వచ్చాయి
తమను నిర్బంధించిన ప్రతి సంకెలను
నోటితో కొరికి వేస్తున్నాయి
జూలు దులిపి ప్రత్యర్థి మీద ఉరుకుతున్నాయి
ప్రతి మనిషిలో ఒక సింహం వుంది
అడవిలో తిరిగేటప్పుడు సూర్య కిరణాలు
దానికి ఊడిగం చేస్తాయి
తటాకాలు దాని చెంతకు వచ్చి దాహం తీరుస్తాయి
లూథర్‌కింగ్ ఒకనాడు గర్జించాడు
వైట్ హౌస్ వణికింది
మళ్ళీ ఈనాడు నల్లసేనలు కదలాయి
తెల్లమబ్బులు కకావికలు అవుతున్నాయి
తెల్లవాడు నల్లవాడి గొంతుమీద కాలేసి తొక్కాడు
అతనికి ఊపిరాడలేదు
'నన్ను ఊపిరి పీల్చుకోనివ్వండి' అని నినదించాడు
అది నల్ల సూర్యోదయానికి పిలుపు అయ్యింది
ఆ నల్లస్త్రీ తెల్ల రాజ్యాన్ని నిలదీస్తుంది
'ఈ నేల మాది.. ఈ సంస్కృతి మాది..
ఈ భవనాలన్నీ మా పూర్వీకుల
శ్రమ నుండి ఆవిర్భవించాయి
నా తల్లి రొమ్ము నుండి పాలుతాగి
మీరు జీవించారు
మీ ఊపిరి మేము..
మీ ఫ్యాక్టరీల్లో శ్రమధారలు మావి
మీ రక్తంలో ప్రతి కణం మా శ్రమ నుండి వచ్చింది
మీరేమో గొంతు నులుముతున్నారు
మీరు వ్యాపారస్థులు
మనుష్యులను, జాతులను
మాంసపు కండల్లా చూస్తారు మీరు
మీరు ఇతర దేశాల దొంగలకు ఆశ్రయం ఇస్తారు
వారికి సర్వభోగాలు కలిగిస్తారు
మీరు వారికి రెడ్‌కార్పెట్ పరుస్తారు
ఈ దేశ పునాదులైన నల్లవారిని బానిసలుగా చూస్తారు'
అని నినదిస్తుంది
ట్రంప్ బంకర్‌లో దాక్కున్నాడు
హిట్లర్ బంకర్‌లో దాక్కున్నాడు
అభద్రత వారిని వెంటాడుతోంది
రోజూ చస్తూ బ్రతుకుతున్నారు
ప్రపంచంలో మూలవాసులంతా
తమ పోరాటాలకు పదును పెడుతున్నారు
లూథర్‌కింగ్ కల నెరవేరే సమయం
ఎంతోకాలం లేదు
నల్లటి మబ్బుల నుండి నెత్తుటి చుక్కలు రాలుతున్నాయి
రక్తాక్షరాలు ప్రపంచమంతా ప్రవహిస్తున్నాయి
ఆకాశం ఉరుముతోంది
భూమి కంపిస్తుంది
జీవించేహక్కు పతాక అవుతుంది
కారంచేడు పోరాటం జ్ఞాపకం అవుతుంది
చుండూరు ప్రతిఘటన గుర్తుకొస్తుంది
దర్బన్ వేదికపై గర్జనలు మళ్ళీ వినిపిస్తున్నాయి
భూమి పొరలు చీల్చుకొని వచ్చినవాడు
శక్తివంతుడని నిరూపిస్తున్నాడు
రాక్, పాక్ సంగీత ధుని నుండి
వివక్షపై గీతం వినిపిస్తుంది
నిందను ఎదిరించి నినాదమైంది
నినాదం పోరాట కెరటం అయ్యింది
సైన్యాలు సమూహ శక్తిని ఆపగలవా!
జీవించేహక్కు కోసం చేసే పోరాటంలో
జీవశక్తి వుంది
పరిణామక్రమంలో అసంఘటితమైందంతా
సంఘటితమవుతుంది
జీవించటమంటే పోరాడటమే!
జీవితం అంటే సంఘర్షణే!
భూమి విచ్చుకోందే విత్తనం మొలవదు
మబ్బుల్లో ఉరుము రాందే చినుకు రాలదు
అంతిమ విజయం నల్ల జాతులదే..!

## నానీలు

ఇవ్వాళ నాకు
కొత్త మిత్రుడు దొరికాడు
ఆలింగనం
కళ్ళతోనే!

బడులు
మూతబడ్డాయి
పూల తోటలు
ధ్వంసమవుతున్న కల!

మాస్కున్నది నాకే
నా పద్యానిక్కాదు
గురి గింజ నలుపు
దానికి తెలుసు!

పద్యం
ప్రదర్శన కోరుకుంటది
లాక్ డౌన్లను
ధిక్కరిస్తది!

– కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440243261.

## అంతిమ విజయం మనదే...

స్వచ్ఛంద నిర్బంధమే ఆయుధంగా..
నిశ్శబ్ద యుద్ధం చేస్తున్నాం ...
లోకాన్నంతా శోకసంద్రం చేస్తున్న
కరోనాపై రణభేరి మ్రోగిస్తున్నాం..
గూడు నొదిలి గింజల వేటలో...
దూర తీరాల్లో..
తల్లడిల్లుతున్న వలస పక్షులను చూస్తున్నాం..
అయిన వారి కోసం ఎదురుచూసే..
ఆత్రుతలో మరిగి పోతున్నాం...
ఆహారం దొరకక మాడుతున్న
పేద కడుపులొకవైపు
కోతకు నోచుకోక మగ్గిపోతున్న
పంటలు మరొక వైపు..
మానవత్వాన్ని పంచుతున్న
మమతలు ఇంకొక వైపు...
చిత్ర, విచిత్ర వైపరీత్యాల్ని చూస్తున్నాం..
మా శరీరమే శత్రు స్థావరమై...
సామాజిక దూరమే వరమై.....
మా స్పర్శే మాకు భయానకమై...
చిగురుటాకుల్లా కంపించి పోతున్నాం...
ఊపిరితిత్తులపై దాడి చేసిన వైరస్
ప్రాణాలను ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే..
ఏకాంతంగా క్వారంటైన్లలో మగ్గుతున్న
దీనులను దీనంగా చూస్తున్నాం...
అనాథలుగా మరుభూమికి
తరలిపోతున్న అలసిన యోధుల
రోదనలను చూస్తున్నాం..
మా ప్రాణ రక్షణకు సైనికులై పోరాడుతున్న
వైద్య, రక్షక దళాల బలిదానాల్ని చూస్తున్నాం..
క్షణక్షణం అనంత వాయువుల్లో,
కలిసిపోతున్న ఆయువుల్ని లెక్కిస్తున్నాం..
సంకల్పమే మా బలంగా...
దైవ శక్తే మా అందరి అండగా..
విశ్వమానవ శ్రేయస్సే మా ఆశయంగా...
ఆయుధం లేని ఈ యుద్ధంలో...
అంతిమ విజయాన్ని కాంక్షిస్తున్నాం...



-ఆర్.శ్రీవాణీశర్మ
9441324587

ఆధిపత్య కాంక్ష
అణచివేతకు మూలం.
సజాతిని, విజాతిని
అది పట్టించుకోదు.
ప్రశ్నించడంలోనూ తనదే
పైచేయుండాలన్న వాంఛ.

-మునిమడుగుల రాజారావు.
7013577140.

## కనువిప్పు

లోగడ
ఎవరితో కలవని పరిస్థితి
ఇప్పుడు మనకే ఎదురైంది.


ఇది వరకు
ముట్టుకుంటే మైలపడుతామనే భావన-
ఇప్పుడు తారుమారైంది.

కొందరితో
మాట్లాడకుండడమే మంచిదన్న అభిప్రాయం
ఇప్పుడు తలక్రిందులైంది.

పూర్వం
ఎవరితోనైనా స్నేహం చెయ్యాలంటే పట్టింపులు
ఇప్పుడు మనకు స్నేహమే దూరమైంది.
నిన్నటిదాకా
ప్రతిదీ చూసినట్లుండేది.
ఇవ్వాళ చూసినా చూడనట్లైంది.
ఆచారాలను, సంప్రదాయాలను విభేధిస్తూ
మొన్నటి దాకా ఏకాంతంలో ఉన్న మనం
ఇప్పుడందరినీ గౌరవించాలనిపిస్తుంది.
నిన్న కొఱవడిన ప్రేమ, దయా, క్షమా గుణం
ఇవ్వాళ మనలో కళ్లు తెరిచాయి.
నిన్నటిదాకా ఎవని పెన్ను వానిదే
ఇవ్వాళ ఎవడు రాసినా ఫరవాలేదనిపిస్తుంది
నిన్నటిదాకా ఎవని అద్దం వానిదే
ఇవ్వాళ ఎవడు చూసినా ఇబ్బంది లేదనిపిస్తుంది.

నేను అన్నభావన
ఇంటి ముందరి వాకిలివంటిది
ఇప్పుడు వాడలోకి రావాలనిపిస్తుంది.

ఇదివరకు
ఒకరితో మాట్లాడాలన్నా విసుక్కునే నోరు
ఇవ్వాళ అందరితో మాట్లాడాలనిపిస్తుంది.
నిన్న తన కోసం సంపాదించింది ఏదైనా
ఇవ్వాళ ఇతరులకు పంచాలనిపిస్తుంది
ఈ రోజు మనం అనుభవిస్తున్న బాధ
ఏ ఒక్కనికో పరిమితం కాదు.
తన బాధ ఇతరులదిగా
ఇతరుల బాధ తనదిగా భావించే పరిస్థితి
తనది తానుగా తినలేని దుస్థితి.
వసుధకు కరోనా వల్ల కల్గిన ముప్పు
వసుధైక కుటుంబ భావనకు కనువిప్పు.



– మసన చెన్నప్ప
సెల్:9885654381

## కరోనా పాతకి

భస్మాసురుణ్ణి
మించింది కరోనా
అదీ.. మరి చైనాలో
పొందింది వరం !!

కనబడని వైరస్సే
కాని...శోధిస్తే
ఉన్న రంగులన్ని
దాని ఒంటిపైనే !!

దాగుడు మూతలంటే
దానికెంతిష్టమో
ప్రతి యిల్లు దానికో
క్రీడా స్థలమే !!

ప్రజల బ్రతుకుల్ని
ఛిద్రం చేసిన
కరోనా ఇపుడు
విశ్వ జపమైంది !!

పిల్లల నిడువదు
పెద్దల నిడువదు
అందరికీ
ఆత్మబంధువే !!

అంతం లేదని
పంతం బూనింది
కరోనా పాతకి
ప్రాణాలిగ కైలాసమే !!

కంటికగపడదు
వొంటినిడవదు
అదిప్పుడు
చాపక్రింద మృత్యు నీరు !!

జనం బతుకుల్ని
మోడులు చేసిన
కరోనా..జనం గుండెల్లో
మండే అగ్నిగోలం !!

పులిని అనుకరించింది
మహమ్మారి
నరగొంతే దాని
కీలక స్థావరం !!

విశ్వమిప్పుడు
దాని చేతిలో పూబంతైంది
అదిప్పుడు
విశ్వవిజేతే !!

దానికాశెక్కువే
ఇంకా ఆగడం లేదు
దాని ఆయువిక
మునివేళ్ళ పైనే !!



-పోమాల హన్మంతు
9989943521.

## జయహో పారిశుద్ధ్య కార్మికా...

ఎండమావిలో గుక్కెడు నీళ్ళు బోసి
తడారిన గొంతుకు దప్పిక తీర్చి
గమ్యానికి దారి చూపిన దైవమల్లే
నిత్యం ఇంటి చుట్టూ తిరుగుతూ
విభిన్న కోణాల్లో అలుపెరుగని బాటన
అంగరక్షకులైన నేస్తం పారిశుద్ధ్య కార్మికులు
చీపురితో వీధుల శుభ్రపరిచి
తడి పొడి చెత్తగా ఇల్లిల్లు తిరిగి
మోరీలను సాపుజేసి, చెత్త కుప్పలెత్తి
రసాయనిక పిచికారీతో క్రిముల జంపి
కంపు వాసనలలో నడిచి, ఇంపుగా మార్చి
మన ఆరోగ్యం కొరకు అండగున్న సైనికులు
కరోనా కథనాన గడపలోనే మనముంటే
ప్రతి ఇంటికి రక్షకులై చుట్టుముట్టి
ఎండకు, వానకు చలించక
ప్రకృతితో పోటీపడుతూ
అనుక్షణం గమనిస్తూ
ఆసరాగా నిలిచే ఆపద్బాంధవులు
కరోనా పోరులో
అమ్ముల పొదలో దాగిన బాణాలై
సంధించడమే తరువాయి తరతమ భేదం లేక
తమ ఆరోగ్యాలను లెక్కచేయక
పరుగెత్తి పనులలో నిలిచే ఆపద్బాంధవులు
ఎంతున్న కార్మికులై ఒదిగిపోయి
అధికారుల పట్ల గౌరవం వహించి
ప్రజలపై ప్రేమను చూపే మదర్ థెరిస్సాలు
పట్టెడన్నం పెట్టి పచ్చికారమేసిచ్చిన
పదే పదే ఇంటి శుభ్రపరిచే అనుబంధాలు
ప్రాణం ఎవరిదైనా ఒక్కటే
జీతం తక్కువైనా, లోకువగా చూసినా
మాలీన్యాలు ఎత్తిపోసి
స్వచ్ఛ ఆరోగ్యాన్ని పంచే సౌధాలు
మీరు ఒక్క ఘడియ కనబడకున్న
అపరిశుభ్ర వీధులై, ప్రళయానికి నిలయాలు
మీ నడకల చూపులతో వ్యాధులన్ని పరారీ
మీ హస్తవాసితో ఆరోగ్య కితాబు
అందుకే నేడు మీకు ప్రతి వీధిన పూల వర్షం
భారతాన జనమంతా చప్పట్లతో జయకేతనం
జయహో పారిశుద్ధ్య కార్మిక
మమ్మల్ని కాపాడే సేవకా..!




-ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

## దేవతలు దిగి రావాలేమో!

గరళ కంఠుడు హాలహలాన్ని
కంఠమునందు బందించినట్లు
మళ్ళీ ఆ వేములవాడ రాజరాజేశ్వరుడు వచ్చి
ఈ కరోనా మహమ్మరిని
కూకటివేలతో పెకిలించాలేమో.
శ్రీమహా విష్ణువు రామావతారముఎత్తి
రాక్షస రావణున్ని సంహరించినట్లు
మళ్ళీ ఆ భద్రాద్రి రామయ్య వచ్చి
ఈ కరోనా మహమ్మరిని
అంతమొందించాలేమో
హిరణ్యకశ్యకుణ్ణి మట్టుపెట్టడానికి
ఉగ్ర నరసింహ రూపాన్ని దాల్చిన
ఆ ధర్మపురి నరసింహుడు
మళ్ళీ ఆ అవతారమెత్తి
ఈ కరోన మహమ్మరిని
కట్టడి చేయాలేమో.
కంటికి కనిపించని కరోనా
మహమ్మారి ఒక
కాలకూట విషములా మారి
ప్రజలందరిని కాటువేస్తుంది
కాటికి చేరుస్తుంది.
కరోనా....నా భరత మాత గడ్డమీద
సై సై అంటూ కాలుదువ్వడం...
నీ తరం కాదు....
పంచభూతాలు నిను పటాపంచలు
చేయడానికి పరుగెడుతున్నాయి.
అష్ట దిక్కులు నిను
అష్ట దిగ్బంధంలో బంధించి
అణచివేయడానికి నీతో
యుద్ధం చేస్తున్నాయి.
ప్రకృతి సైతం నీమీద
కన్నెర్ర చేస్తూ నిను తరిమికొట్టడానికి
తహతహలాడుతున్నాయి.
ఇక నీ మనుగడ సాగదు ....
సాగబోదు..ఈ భువిపైన
ఓ ....మనుజుడా
ఇల్లే మనకు స్వర్గధామం
కాదని బయటకు వస్తే నరకద్వారం
ఇంట్లో ఉండి పాటించు లాక్ డౌన్
కాదని బయటకు వస్తే....
మన బతుకు షట్ డౌన్
ఆచరిద్దాం అధికారుల మాటలను
హోం క్వారన్టైన్ పాటిద్దాం
స్వీయనిర్బంధంలో ఉండి
ఈ కరోనా ఆటకట్టిద్దాం



-అశోక్ గౌనె
9441317361



## కరుణించు కరోనా

కరోనా ఓ కరోనా
కరుణించవా ఇకనన్న!!
జన జీవి తాన్నీ చిన్నా భిన్నం చేశావు
గృహ నిర్బంధానికి గురి చేశావు!!
అగ్ర రాజ్యాన్ని అతలా కుత లమ్ చేశావు
బడుగు రాజ్యాలను కబ ళించావు!!
ఎక్కడైనా ఉంటానని నిరూపించా వు
ఎవరినైనా కా టే స్తానని రుజువు చేశావు!!
పేదబిధనిక తేడా లేదన్నావు
జాతి మతం అక్కరకు రాదన్నావు!!
తుమ్మితే చాలు అంటుకుంటా వు
చేతులు కలిపితే సై అంటావు!!
ప రి శుభ్రత పాటిస్తే రానంటా వు
రోగ నిరోధక శక్తి వుంటే
దరిచేరనంటావు!!
కరోనా మహమ్మారి
నీ చేతిలో పడితే హరీ
శక్తి యుక్తులను ప్రయోగించాము
చేత కాక చేతులెత్తేశాం!!
కాలు బయట పెట్టలేకున్నాము
కా ళ్లు, చేతులు కట్టి పడేశావు
ముక్కు నోరు మూసి పెట్టేశావు!!
చేసింది చాలు కరోనా
కనికరించు కరోనా
విముక్తి కలిగించు ఇక నైనా!!



-ఆచార్య గిడ్డి వెంకట రమణ
9440984416

## ఒంటరి పోరాటం

కదల కుండా ఉండు సోదరా
కరోనా పై పోరుకి
ఇల్లు వదలి రాకురా
మహమ్మారి పై సమరానికి!!

చైనాలో పుట్టిన విష క్రిమి రా
అగ్రరాజ్యం అమెరికా నే వణికిస్తుంది రా
ఇటలీ ని ఇరకాటం లో పెట్టిందిరా
స్పెయిన్ ని ముప్పుతిప్పలు పెడుతుందిరా!!

ఆషామాషీగా చూస్తే హరీ అంటావు రా
బతుకు మీద ఆశ తోయింటికే పరిమితం కారా
పెద్దల మాటను పెడ చెవిన పెట్టకురా
ఇంటిని వదిలి బయటకు రావ ద్దు రా!!

వైద్యులు చేస్తున్న పోరాటా న్నీ చూడరా
పోలీసులు పడుతున్న బాధ ను గమ నించరా
పారిశుద్ధ్య సిబ్బంది శ్రమను గుర్తించ రా
బయటకొచ్చి భయాన్ని పుట్టించకురా!!

పిచ్చి, పిచ్చి సందేశాలు పంపించ కురా
అనవసరం గా ఆందోళన నుకలిగించకరా
చిట్కా వైద్యం తో కరోనా తగ్గదు రా
రోగ నిరోధక శక్తి పెంచు కుంటే మంచి దిరా!!

-ఆచార్య గిడ్డి వెంకట రమణ
చర వాణి 9440984416

## కరోన పై పద్యాలు

కరము తాక నరుని కావలించునటనే
దగ్గి నంత నెదుటి తనువు నంటు
తుమ్మ గానె తగులు దుష్టకరోనట
భయము తొలుగ జేయి భద్రకాళి!

బయట తిరుగ లేము భయమునొదిలిమేము
ఇంట నుండ లేక తంటలేమి?
బంధి ఖాన విడువ భద్రములు తెలిపి
భయము తొలుగ జేయి భద్రకాళి!

వార్త లెన్నొ తెలిపె వార్తాహరులిలను
దిక్కులన్ని కలియ తిరుగు చుండె!
దక్కనీక జనుల తగులు రాక్షసివల్ల
భయము తొలుగ జేయి భద్రకాళి!

విశ్వమంత హడలి వెదుకుచుండెను దారి
జనుల మేలుగోరి జగతి నిలుప
మూల మేదొ తెలిపి ముదములు జేకూర్చి
భయము తొలుగ జేయి భద్రకాళి!

సత్య మిదియె నేమొ సంస్కారములనేర్పె
చేతు లెత్తి మ్రొక్కు చిత్ర ముగను
వింత నాటకంబు విరచించినావమ్మ!
భయము తొలుగ జేయి భద్రకాళి!



- డా.దార్ల రాఘవేంద్రా చారి
9492991636

## నేల విడచి సామేల...?

ఈ...నేల చల్లనిది
ప్రాణులకే.... పెన్నిధి
సహనం ఎంతో కలిగి
జీవం పోస్తు... ఉంది.

నింగితో స్నేహం.. చేసి..
మేఘాలను చూసి మురిసి
రాగాలెన్నో.... పలికించి
పచ్చదనంతో....నవ్వేని.

ఆడుతు పాడుతు తిరిగే
జీవుల మనసును ఎరిగే
చల్లని తల్లీ వడిలో....
బిడ్డలు హాయిగ పెరిగే.

పెరిగిన బిడ్డలు నేడు
చేసిరి ఎంతో ..కీడు
ఎడారిగ మార్చి చూపి
వికాసమంటున్నాడు.

విజ్ఞానము పెరిగి పోయి
మానవతా తరగి పోయి
ఎవరికెవరు కానట్లు....
మనిషి తీరు మారి పోయె.

సహజత్వం విడచి పెట్టి
పశుతత్వమును చేపట్టి
పసిమొగ్గల నలుపుచుండె
మంచితనం విడచి పెట్టి.

ఇంటి వంట మరుస్తుండు
ఫాస్టు ఫుడ్డు మెచ్చుతుండు
ఆరోగ్యం పాడు కాగా
ఆసుపత్రి వెళ్ళుచుండు.

పెద్దలంటె చులకనాయె
హద్దులన్ని దాటిపోయె
సరిహద్దులు దాటు కుంటు
రెచ్చ గొట్టి చచ్చుడాయె.


చేతి పనులు మరుస్తుండు
యంత్రాలను పెంచుతుండు
నియంత్రను కోల్పోయి...
యంత్రమళ్ళె మారుతుండు.

ఏమి బతుకు మనిషిదాయె
భయముతోని గడుపుడాయె
కనిపించని రోగాలకు ...
బలి అవుతు చచ్చుడాయె.

నేల తల్లి దీవెనలు
అందుకొనే మానవులు
ఎల్లప్పుడు హాయిగా
బతికు పుణ్యాత్ములు.



-బి.సుధాకర్
9849243908



## జైత్రయాత్ర కొనసాగిద్దాం..

ఎంతకాలం ఇలా
పిల్లికి జడిసే ఎలుకలా
పులికి వణికిపోయే లేడిలా
భయం భయంగా కాలం గడుపుతూ
ఎప్పటికప్పుడు ఏదో విధంగా
గాయాన్ని రేపుతున్నా
దున్నుకు వెనుకాడని రైతులను చూడు
తోడు నిలుస్తాడన్న కొడుకు
గూడు వదిలి పోతే
ఒంటరిగానే బ్రతుకుసాగించే
వృద్ధ జంటల నిబ్బరం చూడు
పచ్చని వాతావరణం
గుక్కెడు మంచినీరు
కలుషితం కాని గాలి
నిలుపుతాయి నీ ప్రాణాన్ని
పచ్చని చెట్టు పదికాలాల బ్రతుకునిస్తుంది
ఇప్పుడిప్పుడే పూడుతున్న
ఓజోనుకు మంటపెట్టకు
ప్రక్షాళనమైన గంగకు
మరల మురికి అంటించకు
మన ఆరోగ్యం మన చేతిలో
మన ఇల్లే క్వారంటైన్
వంట ఇల్లే వైద్యశాల
భౌతికదూరమే టీకా
వీలైనన్ని మొక్కలను పెంచు
వాహన వాడకాన్ని తగ్గించు
యోగా, ధ్యానాల నిత్యకృత్యం గావించు
అప్పుడిక జయమూ మనదే...
జైత్రయాత్ర మనదే.

## కరోనాతో పోరాటం

మానవుడు పక్షిలా విమానంలో
గగనంలో విహరించగలుగుతున్నాడు
హంసలా నీటిపై పడవలో
ప్రయాణించగలుగుతున్నాడు
నేలపై అనేక రకాల వాహనాలపై పోగలుగుతున్నాడు
ఎప్పటికప్పుడు ప్రకృతి రహస్యాలు
అవగతం చేసుకుంటున్నాడు
ప్రకృతిని జయించే పనిలో వున్నాడు
తన ఉనికిని రక్షించుకునేందుకు
ప్రయత్నిస్తునేవున్నాడు
ఎప్పటికప్పుడు అనుకోని సవాళ్ళు
ఎదుర్కుంటూనేవున్నాడు
ఎన్నోరకాలజబ్బులకు మందుకనిపెట్టాడు
ఈ నాడు కరోనా గట్టి సవాలువిసిరింది
లాక్డౌను ముందు పాటిస్తూ
ఒకరినుండి మరొకరికి
వ్యాపించే ఈ తీగనుతెంపడానికి
సామాజికదూరం ఒక ఆయుధంగా మలచాడు
మరోప్రక్క మందుకనిపెట్టే ప్రయత్నంలో వున్నాడు
సంజీవనిని కనిపెట్టాలి
బాధితులకు పూరటనివ్వాలి
ఈ మహా యజ్ఞంలో తమదీ ఒక సమిధంటూ,
ఎన్నోదేశాలు పూనుకున్నవి
ఎవరుముందు మందు కనిపెడ్తారో
ప్రపంచానికి సాంత్వన కలుగజేస్తారో చూడాలి
ఈ పోరాటంలో యావత్ ప్రపంచం ఏకమయ్యింది
కంటికి కనిపించని వైరస్ మనుషుల్ని కలిపింది
వారిలో స్నేహభావం,
దయాగుణం మేల్కొలిపింది
త్వరలోనే కరోనా చీకటి తొలిగి
మన బ్రతుకుల్లో
తప్పక సూర్యుడు ఉదయిస్తాడు



-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

## నేను రోగిని ప్రేమిస్తున్నాను

నేను రోగిని ప్రేమిస్తున్నాను?
అవును నేను రోగిని ప్రేమిస్తూనే ఉంటాను
రోగమేదైనా రోగానికి గల కారణమేదైనా
రోగులను రోగాలను ఎన్ని చూడలేదు
ఎంతమంది నాడీ పట్టుకోలేదు
సూది మందు కన్నా ముందు సూటిగా మాట్లాడి
మంచి మాటల పలకరింపుల మందునిస్తా
కాటికి కాళ్ళు చాపిన వాళ్ళు సైతం
కూటికి నూకలు దక్కినవని ఎగిరి గంతేసి వెళ్తా
నిజమైన ప్రేమ నిలువుటద్దమై కనపడుతుంటే
ఇంకేం కావాలి ఈ జీవితానికి ?
పెద్ద పెద్ద రోగాలనే కట్టడి చేసిన చేతులు నావి
కరోనా కనికట్టును పట్టుకోలేనా ..?
వైద్య శాస్త్రం ముందు బలాదూర్ అని చెప్పలేనా ?
రూపాలు వేరైనా రూపమొక్కటై ..
గ్రామీణ పట్టణ ప్రజారోగ్య రక్షణకై ..
మీ జీవిత ఆశల శ్వాసకై
ఫ్లారెన్స్ నైటింగేల్‌లా అవతారమెత్తుతా
ఆరోగ్య విద్యా అధికారిక పర్యవేక్షకుడినై
108 సైరన్ మోతల పైలట్ నౌతా
రోగిని హత్తుకొని ఆదరించే స్టెచర్ నౌతా
చికిత్స కైనా శస్త్రచికిత్స కైనా
తనువంతా ఒత్తి చూసి లబ్ డబ్ ల
హెచ్చు తగ్గులు వినే స్టెత స్కోప్ నౌతా
రోగ నిర్ధారణ కై చేసే పరీక్షా కేంద్రాన్నౌతా
పక్క బట్టలు మార్చే క్రమంలో
వార్డు బాయ్ అవతారమెత్తు తా
ఎన్ని రకాల సేవలు చేసిన చేతులు నావి
ఎంత మందిని ఆరోగ్య వంతులను చేసిన చేతలు నావి
వెరసి నేనో కల్లా కపటం లేని తెల్లకోటుని?
రోగాలనే కాదు కరోనాను కట్టడి చేసే క్రమంలో
ఎన్నో నాడులు పట్టుకున్న నా చేతులను
కరోనా మాటువేసి కాటు వేస్తే? నా శవాన్ని
ఖననానికో దహనానికో దారిచూపిస్తారా ??
మానవత్వం బ్రతికే ఉందని ఋజువుచేస్తారా ?..?



-ఎస్ ప్రవీణ్ కుమార్
9866198112

## నానోలు

శిలా
శిల్పి
ఉలి
సుత్తి

సంగీతం
బాణి
గానం
శృతి

క్షీరసముద్రం
మదనం
విషం
అమృతం

గుడి
ప్రదక్షణం
ముక్కు
ఫలం

నారికేళం
తీర్థం
ప్రసాదం
భిక్ష

బాణం
అమ్ములపొది
కత్తి
కరవాలాలు

రైతు
హలం
సేద్యం
కృషి

కుంకుమ
సౌభాగ్యం
చందనం
పరిమళం

పువ్వు
పుప్పొడి
తుమ్మెద
మకరందం

పెళ్లి
ఆహ్వానం
అక్షింతలు.
ఆశీర్వాదం

తపస్సు
మోక్షం
పూజ
పుణ్యం

అర్చన
హారతి
శఠగోపం
తీర్థం

కోయిల
గానం
మయూరం
నాట్యం

గురువు
బడి
విద్యార్థి
చదువు

ధావాఖాన
వైద్యుడు
రోగి
జబ్బు

యోగ
ఏకాగ్రత
వ్యాయామం
సౌష్టవం



-చాపలమహేందర్
9949864152

## ఓటు.. మెరుపులు

ప్రజల రాజ్యమందు
ప్రభలశక్తి ఓటు
జనుల చేతియందు
దివ్యాస్త్రము ఓటు !!

నొసటి రాతరాయు
అసలుబ్రహ్మ ఓటు
బతుకు బాగుచేయు
భవ్యశక్తి ఓటు !!

విల్లు గదలకన్న
విధ్వంసం కన్న
ఆయుధం కన్న
ఓటుశక్తియే మిన్న !!

దీనజనుల చేతి
దివిటియే ఓటు
నిరుద్యోగుల చేతి
కత్తియే ఓటు !!

పేద సాదలకు
పెన్నిధియే ఓటు
రోత పాలనకు
వేటుయే ఓటు !!

ఆయుధం కన్న
అణుబాంబు కన్న
వేటకత్తి కన్న
ఓటుశక్తి మిన్న !!

వాడి వేడియైన
వజ్రాయుధనీ ఓటు
అతి అద్భుతమైన
బ్రహ్మాస్త్రం ఓటు !!

విజయపథం ఓటు
విలువైంది ఓటు
జనులబలం ఓటు
చైతన్యము ఓటు !!

అంగబలం కన్న
అధికారం కన్న
ఓటుయే మిన్న
దానిశక్తియే మిన్న !!

బీరుసీసా కొరకు
బిర్యానీ కొరకు
పచ్చనోటు కొరకు
ఓటును అమ్మకు !!

-మామిడి రమేష్

## ఓ ఉత్తరం ఆశ...

మా పూరు ఉత్తరం రాసింది నాకు
ఒకసారి చూసి పొమ్మని.

కన్నీరు పెడుతున్న చెరువుకు
ఈత కొడుతూ
కలలో వచ్చానని....

జలతగ్గి గొంతులారుతున్న
బావులకు నా గొంతుతో
దప్పిక తీరాలని....

పాడుపడ్డ రచ్చబండ
ఒక్క పలకరింపుతో
పులకించాలన్నదని....

నేల అడుగుకు చేరిన
ఇంటి అరుగులు మనిషి స్పర్శ కోసం
ఆశతో ఎదురుచూస్తున్నాయని

ఒక్కరు తొంగి చూడక
చెదలు పడుతున్న గ్రంథాలయం
ఒంటరిగా ఉండలేనంటుందని

అందమైన జీవితాలను తయారుచేసిన
అక్షర కర్మాగారానికి అవసానదశకు వచ్చిందని,

కాంక్రీట్ కొత్త కళకు
ఆవిరౌతున్న చినుకును చూసి
వెక్కి వెక్కి ఏడుస్తున్న
నేల తల్లి చూడాలన్నదని,

మా పూరు ఉత్తరం రాసింది నాకు
పదే పదే ప్రతి రాత్రి
గుర్తుకొచ్చిన ఊరి ఉత్తరానికి

ఓ బాధ్యతలా,
మా ఊరి నడిబొడ్డులో
పసివాడిలా పారాడి వస్తా......
కన్న తల్లిని పలకరించి వస్తా......

-చందలూరి నారాయణరావు
9704437247

## శబ్ద శిల్పాలు

'నా'వాళ్ళే అనుకుంటే
అది ఒక ఆస్తి
'నా' వాళ్ళు లేకుంటే
అంతా నాస్తి.


'నేను' ఈ పని చేయగలను
ఆత్మ విశ్వాసం
'నేనే' ఈ పని చేయగలను
అహంకారం.



-డా॥ పొరెడ్డి రంగయ్య
99480 49864

## వాల్టా చట్టం

తప్పును నిలదీస్తాం,అవినీతిని ప్రశ్నిస్తాం,
అన్యాయం జరిగిందంటూ
ఆక్రోశాన్ని వెళ్ళ గక్కుతాం ,
న్యాయం కావాలంటూ ప్లకార్డు లు
పట్టుకు తిరుగుతాం..!
సమస్యను సృష్టిస్తాం,
సమస్యలపై పోరాటానికి సిద్ధమవుతాం,
నేరాలు జరిగినప్పుడు కొత్తచట్టాలకై
పట్టుపడతాం , ఆ చట్టాలు చేసే సూచనలు
తుంగలో తొక్కుతాం, తప్పుచేసిన వారిని
శిక్షించమని అడుగుతాం, శిక్ష పడ్డాక
మానవత్వం మంటూ మెలికలు పెడతాం..
తప్పులు పదే పదే చేస్తాం,
మార్పును కూడా కోరుకుంటాం, కానీ..ఆచరణలో
మాత్రం ఓ అడుగు వెనక్కు వేస్తాం...
ఎందుకంటే...మనది ప్రజాస్వామ్య రాజ్యం
ప్రజలచేత,ప్రజల కొరకు,ప్రజలకై ,ఏర్పడిన
రాజ్యం,ప్రాణాలను పణంగా పెట్టి
సాధించుకున్న స్వరాజ్యం,సర్వసత్తాక
సామ్యవాద లౌకిక రాజ్యం....
ఎన్ని పసిప్రాణాలు ఊపిరి ఆడక ఆగిపోయినా ,
చేయని తప్పుకు ఇంకెన్ని దేహాలు
ఉచ్వాస నిచ్వాసల యుద్ధంలో ఓడిపోయినా,
ఎంతమంది తల్లుల ఉసురు పోసుకుంటున్నా,
మరెన్ని కుటుంబాల రోదనలు
బోరుబావుల కుహరాల్లో సమాధులైనా...
వేలెత్తి చూపుతామే తప్ప
బాధ్యతను మాత్రం గుర్తించము...
వాల్టా చట్టం అమలు చేయాలన్న
ఆలోచన అధికారులకు రాదు,
నిరుపయోగంగా ఉన్న బోరుబావులు
పసిప్రాణాలు హరిస్తున్న
రాక్షస నేత్రాలని గత అనుభవాలు చెబుతున్నా వాటిని
వెంటనే మూసివేయాలని ఎప్పుడు
మనకు జ్ఞానోదయం కలుగుతుంది,
ఊపిరికై ఒక్కో క్షణం ఆ పసికందులు
పడ్డ యాతన సాక్షిగా
మరో ప్రాణం బలికాకముందే
కర్తవ్యం ఎప్పుడు మేల్కొంటుంది..!!



-షేక్.నసీమా బేగం
9603567012





(జనవరి 31, 2016న డా॥ ద్వా.నా.శాస్త్రిని జ్ఞాపికతో సత్కరిస్తున్న జస్టిస్ బి.చంద్రకుమార్. )

## ధృవతార

అతడు అక్షరాల్ని ప్రేమించేవాడు
అతడు మనుషుల్ని ప్రేమించేవాడు
అందుకే సాహితీలోకంలో
అందరికీ తలలో నాలుకైపోయాడు
సాహిత్య చరిత్రకారుడిగా
వ్యాసకర్తగా, విమర్శకుడిగా
కవిగా,రూపకకర్తగా
నిర్విరామ ప్రాసంగికునిగా
అన్నింటికీ మించి
పోటీపరీక్షల విద్యార్థులకు
ఉత్తమ శ్రేణి బోధకుడిగా
బహుముఖీన ప్రజ్ఞాపాటవాలను
ఆవిష్కరించిన ధన్యజీవి ద్వానా
తెలుగు సాహిత్య చరిత్రను
ప్రత్యేకించి తెలంగాణా సాహిత్య చరిత్రను
గ్రంథనం చేసిన సాహితీ సమారాధకుడు
మానాన్నగారు వంటి అపురూప గ్రంథానికి
పరికల్పన చేసిన సారస్వత స్వాప్నికుడు
తెలుగు హాస్యామృతాన్ని దోసిళ్ళతో ఎత్తిపోసి
మనందరి దాహార్తి తీర్చినవాడు
ప్రాచీనము, నవీనము
సాహిత్యంలో ద్వానాకి రెండు కళ్ళు
గానసభ వేదికలు, రవీంద్రభారతి వేదికలు
ద్వానా ఆచూకీ తెలియక
వెలవెలబోతున్నాయి
మాట తీరు కాస్తంత పెళుసు గానీ
మనసంతా తమమతలసౌరు
అతిథిగా వున్నా, అతిథేయి అయినా
తాను అందరివాడిననిపిస్తాడు
అందుకే,
అతడు ఎందరిలో వున్నా
ధృవతారాలా నిలుస్తాడు.

(జూన్ 15 డా॥ ద్వా.నా.శాస్త్రి జయంతి సందర్భంగా..)




- మద్దాళి రఘురామ్
సెల్: 9866057777

పుస్తక సమీక్ష

## అపురూపమైన కథాపుష్పాలు -పసిడి మువ్వలు -పారాణి

శాతవాహనుల కాలం నాటి కొన్ని ప్రముఖ పట్టణాలు, క్షేత్రాలు, మతాలు, ఆచారాలను ప్రస్తావిస్తూ సాగిన అపురూపమైన కథాపుష్పాలు ఇవి. రాజులు, రాణులు, నాట్యాచార్యులు, నర్తకి, దేవదాసి వంటి పాత్రల ద్వారా ఆ కాలం నాటి నృత్యం, జక్కుల నృత్యం, ఆంధ్రీ నృత్యం మొదలైన నాట్య రీతులను వివరించారు. దేశాటన శీర్షిక కింద దేశంలోని ఆయా ప్రాంతాల నాట్య రీతుల్ని కూడా వ్యక్తీకరించడం విశేషం. దాదాపు రెండు వేల ఏళ్ళ క్రితం పాలించిన శాతవాహనులు కాలం నాటి కళాత్మకతను పరిచయం చేసే ప్రముఖ నాట్యాచార్యుడు నటరాజ రామకృష్ణ కథారూపం ఇది. ఆ నాటి దేవదాసీలు, నాట్యకత్తెలు, వారి వృత్తిలో పవిత్రత వంటి విషయాలను, సందర్భాలను సన్నివేశాలుగా పాత్రల ద్వారా కథనం చేసారు. నాట్య కళా రూపాలను ఒక గొప్ప భావామయ దృశ్యాలను అక్షరీకరించారు. హిందు, బౌద్ధ మతాల సన్నివేశాలు కూడా ఆనాటి మత, సాంఘిక ఆచారాలను తెలియజేస్తూ వాటికి ఆధారంగా వెలువడిన సంగీతం, నృత్యం, సాహిత్యం, శిల్పం వంటి కళల తీరు తెన్నులను కూడా ఈ గ్రంథంలో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. నాట్య విద్య యొక్క పూర్వ రూపం తెలుగు ప్రాంతాల్లో ఉన్న తీరును ఈ గ్రంథం స్పష్టం చేసింది. 1967 సంవత్సరంలో ఆదర్శ గ్రంథ మండలి వారిచే ప్రచురింపబడిన ఈ గ్రంథం నేడు ప్రస్తుత కళాభిమానులకు అవసరార్థం, ఆనందం కోసం తెలంగాణ సాహిత్య అకాడమి మరల ప్రచురించడం గర్వించదగిన విషయం.

వినూత్నంగా సాగిన ఈ కథాసంపుటిలో42




కథలున్నాయి. కథలు అనేకంటే భాగాలు అనవచ్చు. ప్రతి కథలో అక్కడి వాతావరణం, పరిస్థితులు, మనోభావాలు, ముఖ్యంగా కళారూపాలు తెలియజేసే నెపంలో పన్నీరు జల్లులు, నవసంధి, ఏకాంతసేవ, దేశాటనం, వెన్నెల్లో వేడుక, క్షత్రియత్వం, నవ వసంతం, సాక్షాత్కారం, కరిగిపోయిన కల, వసంతోత్సవం, ఐరావతం, మతాల యుద్ధం, వజ్రాల హారం, గర్జించిన వేఘాలు, మాలతీ మదన తిలక, ధాన్యకటకం, అచలేశ్వర కపాలి, అఘోరి సన్యాసి, విజయపురి, అమరావతి స్నాతం, సంధ్యారాగం మొదలైనవి ఎంతో దివ్యంగా తీర్చిదిద్దారు. వీటిలోని ప్రతి వాక్యం మనోరంజకంగా నడిచింది. ఆంధ్రుల అపూర్వ కళావైభవాన్ని తెలిపే నాగార్జున శిథిలాలు దర్శించడానికి వెళ్ళిన ఈ రచయిత చేసిన ఈ కథా రూపకల్పన ఒక అద్భుతమైన సృష్టి. ఇందులోని భావం, భాష నవనీతంగా సాగింది. మువ్వ అంటే ముద్దులొలికే భావాలను పలికించేది. అలాంటిది పసిడి మువ్వ అంటే ఇంకెంత అందంగా ఉంటుందో ఆలోచించండి. పారాణి అంటేనే మృదువైన పాదాలకు మరింత శోభను కలిగించేది. అలాంటిది నాట్య చరిత్రను వివరించే క్రమంలో తీర్చిదిద్దిన ఈ కథలకు "పసిడి మువ్వలు-పారాణి" అనే చక్కని పేరును నిర్ణయించినప్పుడే అర్థమయింది ఈ కథల్లోని అందం. ఊహలతో సాగే కథలు కావు ఇవి. అనుభవాత్మకంగా సాగినవి. రచయితకు అభినందనలు.. ఇలాంటి కథలకు మరోసారి గ్రంథస్థం చేసిన తెలంగాణ సాహిత్య అకాడమి వారికి ధన్యవాదములు..

ప్రతులకు:
తెలంగాణ సాహిత్య అకాడమి
ఫోన్: 040-29703142



-శైలజామిత్ర
9290900879

# రైతు -మొగ్గలు

వారి స్వేద బిందువులు మన ఆత్మబంధువులై
మన జానెడు పొట్టకు అక్షయ పాత్ర అవుతుంది
అన్నార్తులకు ఆపన్న హస్తం మన రైతు

వాన నీళ్ళకోసం ఎదురుచూడక కష్టపడుతూనే
పాడి పంటల కోసం కన్నీళ్ళను దిగమింగుతాడు
ఆకలి,దప్పులు తీర్చే అపర బ్రహ్మ మన రైతు

కరువు కాటేస్తున్నా తన వెన్ను చూపకుండానే
మన్నును నమ్ముకుని మనల్ని బ్రతికిస్తుంటాడు
అన్నపూర్ణమ్మకు దత్తపుత్రుడు మన రైతు

మన కడుపు కోసం తన ఏడుపు ఆపుకుంటూనే
మన మెతుకు కోసం తను బ్రతుకుతుంటాడు
ఎన్ని కష్టాలొచ్చినా ఎదుర్కునే సవ్యసాచి మన రైతు

తన కుటుంబాన్ని ఒకవైపు పోషించు కుంటూనే
మన కుటుంబాలకి పెద్దన్న పాత్ర పోషిస్తుంటాడు
అలుపెరగని మహా యోధుడు మన రైతు



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

# తీరని దాహం కోరిక

కోరికలు కాలిపోను
కూర్చొనివ్వవు... నిలబడనియవవ్వు
మీసాల మీద
నిమ్మకాయలు
నిలబెట్టే నాకే
నిముషముకూడా
నిదురలేకుండా చేస్తున్నాయి

అంతులేని కోరికలు
శ్రమలేని బహుమతులు
జింక ను వేటాడాలని సింహమునకు కోరిక
సింహమును వేటాడాలని మనిషి కోరిక
మనిషిని వేటాడాలని ఆ భగవంతుని కోరిక
శ్రమదోపిడితో
సపాదించాలన్నది
వ్యాపారస్తుల కోరిక
మోసంచేసి గెలువాలన్నది
రాజకీయ నాయకుల కోరిక

కానిబిడ్డపై
స్వచ్ఛమైన మమకారం చూపే
తల్లీ ప్రేమ కోరికతో
నీవు ఓడిపోయావు
ఎందుకు

నా జీవితానికి
వచ్చావో తెలియదు

ఎందుకు
నేను
నీ వైపు
ఆకర్షితున్నయాన్నో
తెలియదు

కాని
నీ వల్లే
మనిషి మృగంగా మారుతున్నాడు
నీ వల్లే మనిషిగా మారుతున్నాడు

మనిషిగా గర్వపడాలా
మృగంగా బాధపడాలా
అన్నది మరో కోరిక
అందుకే
నా కోరిక
తీరని దాహం ....



-డా.తెలుగు తిరుమలేష్
9908910398

# ప్రశ్నించుకో...

చూపు మందగిస్తుంది..
ఆకలి కడుపులో మెలిపెడుతుంది..
ఆత్మాభిమానం చేయి చాచనివ్వదు..
తగబడే అడుగు ...
మృత్యువు కౌగిట్లోకి చల్లగా జారుకుంటుంది..
ఆదరణ తగ్గినందుకో...
నిరాదరణ పెరిగినందుకో....

పాల బువ్వ తినిపించిన చేతులు
లాలనగా మురిపంగా తడిమిన చేతులు
చిరంజీవా అంటూ మనసారా దీవించిన చేతులు
పట్టు తప్పుతున్నవి చేతిలోని ఊతకర్రను నిలుపలేక....

నాన్నా !కన్నా!
అంటూ ప్రేమను రంగరించి
మాధుర్యం గొంతులో పలికించిన కంఠం
జీరబోతుంది!తన వారినే ఏదీ అడగలేక.

ఉరుకులు పరుగులు జీవితంలో
ఊయల ఊపుతూ,జోలపాటలు పాడుతూ
నిద్రపుచ్చిన మాతృ హృదయం...
నేడు నిద్దురే దరిచేరని చీకటిలో ఒదిగి పోతుంది.

తడబడే అడుగులను చూస్తూ..
నా కన్నయ్య నడయాడే నేల ఇదే
అని మురిసిన అమ్మ!
అదే నేలపై వస్త్రమైనలేక ముదుచుకుంటుంది.

ఆసరాలేని ఎందరో స్త్రీ మూర్తులు ఇలా
వారు కోరుకునేది కోట్ల సంపద కాదు
ఆకలితో ఉంగలు చుట్టుకునే కడుపుకు
గంజి నీళ్ళతో అయినా గుప్పెడు మెతుకులు.
-(మా మనసును కూడా ప్రశ్నించుకోమంటూ..??.)



-రాము కోలా
9849001201

# మట్టి

మట్టిని తల్లిలా తలుస్తాం,ఎందుకో తెలుసా?
పట్టెడన్నాన్ని,తట్టెడు ఫలాల్ని ఇస్తుంది గనుక.
గుండెల మీద దున్ని చారికలు చేసినా
తన గాయాల్ని కూరగాయలుగా చేస్తోంది గనుక.
నువ్వు గర్భాన్ని తొవ్వినప్పుడల్లా ఓర్చుకుని
గనులుగానో,మనులుగానో,పనులుగానో మారుతోంది గనుక.

మహాకాసారాలనీ,మన సంసారాలనీ మోస్తోందయ్య!
మనం తిరిగి ఏం ఇవ్వగలం?
వెర్రి తలలతో అర్రులు చాచుకుని భూమిని కబళించడం మానగలమా?
అక్రమంగా ఆక్రమించుకోవటం,ఆకాశ భవణాలు నిర్మించుకోవటం వదలగలమా?
ప్లాస్టిక్ తో భూ ఉపరితలాన్ని నింపేసి
ఊపిరాడకుండా చేయటం త్యజిస్తామా?
అవని బిడ్డలైన అడవుల్ని నిర్దాక్షిణ్యంగా
నరకడం ఆపేయ్యగలమా?

మట్టి ఎంత మధురమైనదో,అందమైనదో తెలుసా నేస్తమా?
తొలకరి రోజున వీచే పరిమళమంత గొప్పది.
వజ్రాలు పరుచుకున్నంత అమూల్యమైనది.
కాలువలనూ,కొలనులో కమలాలనూ పుట్టించేంత అపురూపమైనది.
తీరొక్క పూలను,ఋతువుకో కాయను
అందించేంత సుందరమైనది.

సిగ్గులేని జన్మలు మనవి
తప్పొప్పులు ఒప్పుకోము గదా తప్పించుకుంటాము.
వడ్డించిన విస్తరిలో పోయేటోళ్ళం.
అన్నం పెట్టినోడిని తన్నేటోళ్ళం.
వచ్చే కాలమంతా పోయేకాలం
అవుతుందన్నది శాపమేం కాదు,తథ్యం.

-జాలె మౌలాలి,
8464048293

# మేల్కొలుపు

తరం తరం నిరంతరం సాగుతూ
నేనేమై పోయినా నీ జీవితంలో
ఈ లోకానికి ఏమైనా చేసిపో
నీకు గుర్తు లేకపోయినా
ఈ లోకం గుర్తుంచుకునేలా
వెలుగుని పంచిపో
నింగిలోని తారలలో నీపేరు ఉండే
తారని లోకానికి ఇచ్చిపో.

నీ దారిని నలుగురు
నడిచే బాటగా మార్చిపో
నీవులేని లోకంలో నీ
అడుగులో అడుగు వేసే
నవశకాన్ని మొదలుపెట్టి పో.

నీవే సృష్టికర్తవు నీ జీవితంలో
సృష్టించు కొత్త కొత్త మార్గాలను
నిలిచిపో నవయుగ వైతాళికుడిగా

భారం మోస్తూ బాధపడక
చిరునవ్వుతో సాగిపో
ఓటమి ఎదురైనా
ఓర్పును అలవర్చుకో
సాగు ముందుకు.

అంతరించిపోతున్న
మానవతా విలువలను
సరిఅయిన రీతిలో నిలిపిపో
తొలి సంధ్య కిరణమై
నిద్రించిన లోకాన్ని మేల్కొలిపి
కొత్త మొక్కలను నాటిపో.



-పి.విశాలాక్షి
9908435805

# మెరుపులు

మెరుపులను పట్టితిని
భాష బ్రతుకుటకు
హృదయము తట్టితిని
మనసు మారుటకు !!

జాలి చూపేందుకు
గాలితో పనిలేదు
జార విడిచేందుకు
ఆలితో పనిలేదు !!

చెవులకు అందం
గుండ్రని దుద్దులు
మనిషికి అందం
మంచి బుద్దులు !!

కాలు జారడమంటే
దెబ్బ తగలడంకాదు
దీపం ఆరడమంటే
వెలుగు పోవడంకాదు !!

అంగవైకల్యం అనేది
లోపం కాదు
అలా పుట్టడమనేది
శాపం కాదు !!

అర్ధాంగి మాటలకు
అర్థాలు వేరు
చేసేటి పనులకు
ఫలితాలు వేరు !!

అప్పు ఎన్నటికైన
పెద్ద ముప్పు
అమర్యాదగ మాట్లాడిన
అది పెద్దతప్పు !!

నిందలు భరించినా
సహనానికి హద్దుండాలి
పనులెన్ని చేసినా
దున్నడానికి ఎద్దుండాలి !!




-తాండ్ర చిరంజీవి
సెల్ : 9959180762

# రాజకీయం

ఎక్కడైనా రాజకీయం!
లేనిదెక్కడ రాజకీయం!
రాజకీయమే లేకపోతే
రాజులోలే బతుకొచ్చు!
పార్టీలందు పదవులంటరు
ఏమోచేత్తరు ఎగురుతుంటరు
ఎనుకముందు ఏదిజుడరు!
ఒకటేదండం ఓటు కోసము
ఒట్టువెట్టుడు ఓటునడుగుడు
ఆశజెప్పి అలుముకునుడు
గెలిచినంక గేరు మార్చుడు
మానవత్వం మంట్లే గల్పుడు
అధికారమో! అహంకారమో!
రంగులజెండాతో రంకుబుద్ధితో
దగ్గరోన్ని దూరపోన్ని
తెలిసినోన్ని తెలియనట్టు
మంచి చెడుతో మత్లబేంటి!
వేషం వేసి మోసం జేసి
చేయనివేమో చేపిత్తుంటరు
రాజకీయమ రౌడీయిజమా!
రాజకీయము రోజో రోగం!
వాట్సప్పులో వాడి బొమ్మలు
ఫేసుబుక్కులో వీడి గొప్పలు
సన్నాసుల పాలనలో
శాంతికలిగే దెక్కడా!
వేటగాళ్ల ఉరుల సాత్రము
సేవా అంటరు స్వాహా చేత్తరు
ఇవాళ్లున్నది రేపుండునా!
ఏదైనా ఎప్పటికుండునా!

దోచేవాల్లు దాచేవాల్లు
పరేషాను జేసేవాల్లు
పనిలేని పాలకులారా!
నోరు తెరిస్తే నోరు మూత్తరు
ఆడీడజెప్పి ఆగం జేత్తరు
మనసంతా పరిక్కంపే!
ముట్టుకుంటే ముండ్ల కంప
గరీబోన్ని గంగల గల్పితే
ఉట్టిగవోదు ఉసురుతలుగును
చెమటకంపు తెలియని మీకు
ఎక్కడైన రాజకీయం
లేనిదెక్కడ రాజకీయం
దుబ్బతుత్తురు రాజకీయం
దుల్పుతుంటే వోవునా!
నిజం తెలుసుకో!
నీతి నడ్చుకో!
దేవునోలే జూసుకుంటే
దయ్యాల్ల జుర్రుతారా!
కలిసి మెలిసి ముందుకెల్తే
కష్ట మేడా వుంటది!
ఏమిజేసిన కడుపుకే!
ఏదో రోజు కాటికే!
నాదిగాదు నీదిగాదు
ఎవ్వరిది ఏది గాదు
బుద్ధి లేని గాడిదోలే
వద్దు వద్దు రాజకీయం
నేల బుద్ధి తెచ్చుకో!
నీల్ల శుద్ధితెలుసుకో!



- డా॥ పెరుకరాజు
సెల్: 9849618364

# హస్త భూషణం

కలకాము తోడుగ
మనిషి యెద సవ్వడిగ
జేబు రమాలుంటది
జీవితాన నీడగ !!

ఆపదలో నున్నపుడు
తోడు ఎవరు లేనప్పుడు
జేబునుండి బయటికొచ్చి
సేవ ముందు జేయప్పుడు !!

కష్టములో తోడొస్తది
కంటి చెమ్మ తూడుస్తది
అమ్మగ తను మారిపోయి
నాశిక శుభ్రము జేస్తది !!

సూర్యుని తాపానికి
కురిసే వర్షానికి
రక్షణగా వుంటది
చల్లని చలి గాలికి !!

అమ్మగాధరస్తది
ఆలిసేవ జేస్తది
అనునిత్యము వీడకుండ
అపురూపము జూస్తది !!

చూస్తే జానెడుండదు
ప్రాణమేమి వుండదు
సీటుమీద పులిగ మారి
తరుమ కుండ మానదు !!

స్వేదాన్ని తూడుస్తది
గాయానికి కట్టైతది
అంతా శుభ్రము జేసి
తను మురికిగ మారుతది !!

సహనానికి సలాము
సేవలకే గులాము
తోడు తాను వుందంటే
బ్రతుకంత సుఫలాము !!

బట్టకున్న విశ్వాసము
జగతిలోన రాదు సమము
ప్రాణమున్న మనిషి కన్న
వేయి రేట్లు దస్తి ఘనము !!

చిరకాలము చిరాయువుగ
వెలుగొందుము నిత్యముగ
హస్తభూషణానివై
కాంతులీను యుగాంతముగ. !!



-పోమాల హన్మంతు
9989934521.

# కలల అలలు

నా కలల మబ్బుల మడిలో..
ఆశల విత్తులు నాటి
పుష్కల పంటలు పండించాలె !

మట్టి నేలపై స్వప్నాలు
దించాలి ఇంద్ర ధనుస్సులు !

నా కలల అలలు
లేమికి చెరగని చిరునవ్వులు !

ఈదురు గాలులకైనా వెరవని
వెదురు తడికెల గదులే నా కలలు !

నా కళ్ల చెలిమెల నిండా
పట్టనన్ని కలల ఊటల ధారలు !

నా మది పెరట్లోని కుండీలో
విరగబూసిన కలల పుష్పగుచ్ఛాలు !

నా స్వప్న సంపదలన్నీ సాకారమై
జీవిత గుమ్ములన్నీ ఆనంద ధాన్యంతో
నిండు గర్భిణుల్లా వెలుగుతూ వర్ధిల్లాలె !



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037


# నిజం

నిశ్చల మనసుతో మెలిగేలా చేసే నిండుతనాన్ని అందిస్తుంది-నిజం
నిస్వార్థపు జీవనరీతిని అందించే జీవనజ్యోతి-నిజం
నిక్షేపంలా అలరిస్తూ-ఆక్షేపణలు చేయనివ్వదు-నిజం
నిర్లిప్తత స్థితిలో- నిన్ను వెన్నుతట్టి ప్రోత్సహిస్తుంది- నిజం

నిండుకుండలాంటి నిజాయితీని అలవరించే వరం- నిజం
నిరంతరాయంగా చేదోడువాదోడుగా వుండేలా చేస్తుంది-నిజం
నిలకడలేని మనసుతో నోరుజారితే- ముప్పుతప్పదని తెలియజేస్తుంది-నిజం
నిరంతరం జ్ఞానతృష్ణను అందించే ఆణిముత్యం-నిజం

నిండుమనసుతో నిర్భయంగా ముందడుగు వేయిస్తుంది-నిజం
నిరపరాధికి- అపఖ్యాతిని అంటనీయదు-నిజం
నిర్మలంగా మసలుతూ నిప్పులు చెలరేగే పనుల్ల చేయనివ్వదు-నిజం
నిండైన ఘనచరిత్రను వ్యాసపీఠంపై నిలచేలా చేస్తుంది-నిజం

నిన్ను నిరంతరం అలరించే కృష్ణగాన గీతికల పారవశ్యం-నిజం
నిన్ను మిన్నగా తీర్చిదిద్దుకునేలా చేసే- నాగమణి-నిజం
నిన్న లేని అందాన్ని నిండు మనసుతో అందించే గంగా ప్రవాహం-నిజం
నిరుపమాన నారాయణ స్వరూప తేజోనైజం-నిజం



- లంకా వేంకట సుబ్రహ్మణ్యం
సెల్: 94404 48650

# ధరణి

ధరణికి వందనాలతో
వరిని పండించును
వనాలు పెంచును
విలువలెన్నో నేర్పుటకు
ఓరిమిలో నిన్ను పోల్చెదరు

ఎన్ని చేతులు నిన్ను తవ్వినా
ఎన్ని యంత్రాలతో బోర్లు వేసినా
లోలోపల నీకు నీవే
అతలాకుతలమవుతూ
వేదనల్ని భరించాలని
నీతి పాఠమొకటి చెప్తావ్

జగమంతా
నిన్ను పాదాలతో తొక్కినా
రవాణా పేరుతో
పెద్ద పెద్ద వాహనాలు
నీవు భరించలేని భారమని తెలిసి
నీ గుండెపైన వెళ్ళినను
గమ్మున ఉంటావు.

హలంతో పొలంలో రైతు గాట్లు పెట్టినా
పచ్చని పైరుతో కళకళలాడుతూ
కంటనీరు తుడిచే నేస్తమౌతావ్
కొండలనెన్నో మోయుచుంటివి
కోట్లాది మానవాళి భారము కాదంటివి.

ఆయుష్షు తీరి నీపై ఒరిగితే
ఆర్తిగా గుండెలకు హత్తుకుంటివి.
కన్నతల్లి వలె కడుపులోన దాస్తివి
ఏమిచ్చి నీ రుణం తీర్చెదము
జీవమున్న వేళ నీపై ఉండటం తప్ప
నిర్జీవమై నీలో కలియటం తప్ప
ఆదర్శానికి నిన్ను కొనియాడడం తప్ప...
ఏమివ్వలేని అజ్ఞానులం



-విజయలక్ష్మీమార
9533333191

# నిన్న నిర్లక్ష్యం నేడు సంక్షోభం

ఒకనాడు
సమృద్ధిగా ఉన్న
వన సంపద ...నేడు
అందని ద్రాక్షగా మారింది
కాంక్రీటు భవనాల మధ్య
పచ్చదనం కరువైపోతూ
ప్రకృతి సమతుల్యత
దెబ్బతిని పైరు పచ్చని
నేలతల్లి నెర్రలు విచ్చి
భూగర్భ జలాలు ..
అడుగంటుతున్నాయి
జల సిరులతో కలకలలాడే
కృష్ణా గోదావరులు ..ఇంకి
నాటి చారిత్రక కట్టడాలు
అగుపిస్తున్నాయి
చుక్క నీరు లేక
జీవ జాతి అంతా

అల్లాడుతోంది
అందుకే రావాలి
అందరిలో చైతన్యం
పచ్చని మొక్కలు నాటి
నేలతల్లికి పచ్చని
కోక కానుక ఇద్దాం
కరువు కోరల్లో .. నేడు
పిచ్చుకలు సమిధలయితే
రేపు మనుషుల సంగతేంటి ?
పచ్చని ఆవరణ కోసం
పసిడి పచ్చని దేశం కోసం
శ్రమిద్దాం...ముందుకు సాగుదాం !



-సునీత బందారు
9440671530

# ప్రజాస్వామ్య పట్టు గొమ్మలు.. !

ఉదయాన్నే దినపత్రిక
చదువరుల వార్తపుత్రిక
విశ్వవివిధ విషయాలను
విశదీకరించు మాతృక!

పత్రికలుంటేనే ప్రగతి
లేకుంటె ప్రజ కథోగతి
దినదిన వార్తల పోకడ
మనముందుంచే సుకృతి!

పాత్రికేయ మిత్రులతోడు
పత్రిక రంగానికె జోడు
మూల స్తంభాలే వీరు
తెలియ జెప్పే ప్రజాగోడు!

నలుమూల వార్తల తెచ్చి
పత్రికల ద్వార మనకిచ్చి
ప్రాణాల సైతం వెరువక
పఠితులను మెప్పింతు(రిచ్చి!

నిత్య వార్తల వారధులు
పత్రికలకు పట్టుకొమ్మలు
అరకొర జీతాలతోడ..
నిరతము సత్యసారధులు!

ప్రజా సమస్యలకు మిత్రులు
వైవిధ్య వార్తల పుత్రులు..
మానవీయ కథనాలను..
మన ముందుంచే భ్రాతలు!

పత్రిక మానవమనుగడకు
చేతన నిత్తురు జనతకు
జీవ మిచ్చెడి నాదాలు..
ప్రాణత్యాగమేనుతుదకు!

పత్రికల్లేక లేదు ప్రగతి
ప్రజలకుచూపేను సుగతి
పత్రికాదరణ లేకపోతె...
ప్రజాస్వామ్యమధోగతి!!

దినపత్రికలు చదువుదాము
జ్ఞాన ప్రభల వెలుగుదాము
విశ్వ వార్తలన్నీ చదివి..
పత్రిక నియతి నిలుపుదాము!!



-డా. గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

# నేతన్న మొగ్గలు?

బాబూజీ చేతపట్టిన రాట్నం నేతన్న చైతన్యాన్ని గుర్తుగా
అగ్గిపెట్టెలో పట్టె చీరను నేచిన నేతన్న నాటి కాలంలో పనివంతుడు
చేనేత కళాత్మక వృత్తికే వన్నెతెచ్చిన నైపుణ్య శోధకుడు నేతన్న .

మాతృ భూమి దేహాన్ని బట్టలతో కప్పి ఉంచుతున్న
నేతన్న పొట్టకూటికోసం పడరానిపాట్లు పడుతున్నడు
సరియైన ప్రతిఫలం దక్కక,పనిచేయలేక చేస్తున్న శ్రమైక జీవి నేతన్న.

ఆధునిక పోకడలు మారిన నేతన్న జీవనశైలిలో
మగ్గం ఆడితే గానీ డొక్కాడని డొల్ల జీవన బ్రతుకులు
తంతుగా నమ్మిన కులవృత్తిని ప్రాణం పోస్తున్న నైతిక ధీరుడు.

కాపలా కాస్తున్న సైనికుడిలా నేతన్న మగ్గంతో పోరు అనునిత్యం
కాయకష్టంతో జానెడు కడుపు ఆకలి తీర్చుకునేందుకు కఠోర శ్రమ నేతన్నది
శ్రమనే ఆయుధంగా చేసుకొని సంసార సాగరాన్ని ఈదుతున్న ధైర్య శాలీలు.

పచ్చని చెట్లతో రంగు రంగుల పూలతో వన్యప్రాణుల బొమ్మలతో
ప్రకృతమ్మను పంచిచ్చిన అందాలను వలువల పై అల్లిన చిత్రకారులే చేనేత వీరులు
మానవాళిని మంత్రముగ్ధుల్ని చేసి,
చేనేత కళాత్మక వృత్తికే పట్టుకొమ్మలు నేతన్నలు.



- కొలిపాక శ్రీనివాస్
9866514972

# మనసు-మనిషి

గుప్పెడంత గుండెకు
మనసున్నప్పుడే
తడిబారినా పొడిబారినా.
కొన్ని సందర్భాలు గుండె
రాయిచేసుకోవాలను కుంటె
కొన్ని చెరువైపోయేలాచేస్తాయి.
మొండికేసిన గుండె
ఎంతపాషాణమైనా
ఒక్కోసారి కరగకమానదు
రాయికి సయితం చెమ్మచేరితే
ఎక్కడనుంచో విత్తుమొలుస్తుంది
పచ్చదనం వెల్లివిరుస్తుంది
గుండె లో అగ్నిజ్వాలలురేగొచ్చు
గుండెల్లో రైళ్ళు పరిగెత్తొచ్చు

స్పందనలేవో కదిలించొచ్చు
హృదయవైశాల్యం పెరిగి
ఔదార్యం బయిటపడొచ్చేసారి
మనసున్న మారాజనిపించుకోవచ్చు
ఎప్పుడైనా గుండె ఆర్ద్రత కోల్పోతే
మనిషితనం మాయమైనట్టే
మనసులేని మనిషికన్నా
మానే నయమనిపించొచ్చు.



-డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి
9849331554

# ప్రియతమా

నువ్వు నన్నూ
నేను నిన్నూ
ప్రేమించకపోవడం ఏమిటీ
మనం మనుషులం కాదా.

అయినా మన మధ్యన
లోహపు గోడలు ఏమీ లేవు
వెడల్పాటి కందకాలూ లేవు
ముళ్ళ కంచెలూ అసలే లేవు

ఆలింగనాలూ హస్తస్పర్శలూ
బహుపంక్తి భోజనాలూ
ఇచ్చిపుచ్చుకోవడాలూ
అక్కరే లేదు ప్రియా
కరోనా కాలం

కరుణామృత పూరిత
కన్నులతో అమ్ములు
విసురుకుంటే చాలు
మనసులు జతకడతాయి

ఏమోలే గతం గతః
మనం ఒకరిని ఒకరం
గాయపరుచుకున్నది నిజమేనెమో మరి

అవన్నీ నెమరువేసుకొని
కోరలు నూరుకోవడం
అవసరమా

నాటివలె నేడు లేదుగదా
నేటివలె మరో నాడు
ఉండదు కదా
కాలం నది నిన్నూ నన్నూ
కడిగేస్తుందని మనకు
తెలియనిదా

ఎవడో ఒకడు మన మధ్య
పగల నెగళ్లు రాజేసి
చలి కాచుకుంటూ ఉంటాడు

నువ్ ప్రేమిస్తావో లేదో కానీ
నిన్ను మాత్రం ప్రేమిస్తూనే ఉంటాను.

-పర్కపెల్లి యాదగిరి,
9299909516

# అవిశ్రాంత సైనికుడు

ఇన్నాళ్లు యెన్నో అగచాట్లు పడ్డావు
అందరిని ఇండ్లలో ఉండేట్టు చేశావు
కన్నతండ్రి వోలె కంటికి రెప్పలా
కాపాడుకున్నావు
కణజీవి బూచికీ వెరువకుండ వుండి
రహదారులన్నింట కాపలా కాశావు
మనిషికీ మనిషికి మధ్య దూరముండి
మసలునట్లుగ నీవు మనసుతో ఉంచావు
మద్యప్రియులు వచ్చి మధ్యలో జొరబడ,
మళ్ళీ మొదటి కొచ్చి మరలి చూచునేమొ
మహమ్మారి మనుషుల కబలించి వేయునో...

రక్షకుడా దిగులెందుకు?
నీవు రాల్చే కన్నీటి చుక్క
మందు బాబుల మందులో కలిసి

గరళంలోకింకి పోతోంది
భౌతిక దూరం బేజారైపోగా
బిత్తరబోయి చూస్తున్న
నీ కళ్ళేచెబుతున్నయ్
అలసిన మనసుకు విశ్రాంతి లేదని....
పట్టువిడుపుల లాక్ డౌన్‌లో
చొచ్చుకు పోయే కాలనాగు
ఎవరిని కాటేస్తుందో........?



-యెనిశెట్టి గంగా ప్రసాద్.
సెల్ 9866447234.

# వెలుగు బాటలు... గ్రంథాలయాలు

సకల శాస్త్రాలకు
సాంకేతిక విజ్ఞానాన్నికి
వెన్నెముకగా నిలుస్తూ
జ్ఞాన సముపార్జనకు
తోడ్పడే ప్రధాన రహదారులు
విద్య విజ్ఞానానికి
ఆసరాగా నిలుస్తూ
మస్తకాలను కదిలించే
పుస్తకాల పునాదులతో
పరిణతి చెందిన
సమాజాన్ని నిర్మించే
నిర్మాణాలయాలు !
వ్యక్తి శీలసంపదను
సంస్కారాన్ని వ్యక్తిత్వాన్ని
రూపొందిస్తూ
ప్రజలందరికీ సమాన
అవకాశాలను కల్పించే
ఏకైక ప్రవర్తనాలయాలు !
సకల కళలకు
వివిధ శాస్త్రాలకు
సాహిత్య ప్రక్రియలకు
సంబంధించిన గ్రంథాలతో
మెదడుకు మేతపెట్టే
సార్వజనీన శాశ్వత
స్వయం శిక్షణాలయాలు !
పిల్లల కోసం బాలసాహిత్యం
వృద్ధులకు పురాణసాహిత్యం
అందరి కోసం ఆధునిక
సాహిత్యం తో ఊతమిస్తూ ...
ప్రజల జీవన విధానాన్ని
మార్చే ఆదర్శ నిలయాలు !
ప్రముఖుల అనుభవాలు
సుప్రసిద్ధుల జీవిత గమ్యాలు

దేశభక్తుల స్వీయ చరిత్రలతో
జన మేధస్సును
ఒక తాటిపైకి
తెచ్చే చైతన్యాలయాలు !
ఆదర్శవంతమైన సమాజాన్ని
నిర్మించుకునేందుకు
సేవాతత్పరతను
నిలుపుకునేందుకు
విమోచన ఉద్యమం
జాతీయ ఉద్యమం
ఏ ఉద్యమాల కైనా
ఆదర్శంగా నిలిచిన
అధ్యయనాలయాలు !
పాఠకుల మానసిక వికాసానికి
ఉపయోగపడుతూ
ఇష్టా గోష్టిలతో ...
ప్రయోజనకర సదస్సులతో
సమాలోచనలు చేయడానికై
చోటు కల్పించే ఆశ్రమాలయాలు !
మరి . .మరి . .
ఈ కంప్యూటర్ యుగంలో
గ్రంథాలయాలు
కనుమరుగు కాకుండా
అంతర్జాలములో
అంతర్ధానం కాకుండా
గ్రంథాలయాల పరిరక్షణకు కదలాలి
భవితకు మార్గదర్శకులు అవ్వాలి !
జై గ్రంథాలయం ..
జై జై గ్రంథాలయం !!



-బి రవి చంచల
860330700

# వర్తమానం

అన్ని పక్షులు
గూళ్ళకు చేరినట్లేనా
కన్నీళ్ళు మోయడం
కష్టంగా ఉంది!

కాలం మారింది
కేంద్రం
నీకేమిచ్చిందన్నది కాదు
కేంద్రానికి నీవేమిచ్చావ్?!

ఇరవై లక్షల కోట్లు
లెక్క పెట్టే సరికి
ఎన్నికలే వస్తాయి
హే! రాం!!

గట్టి మేల్కొటున
వట్టి మాటలు
కట్టి పెట్టన్నారా
దేశ భక్తికి పరీక్షే!

ఎవరూ టెన్షన్ పడొద్దు
క్యాష్ లెస్ భారతంలో
క్యాష్ లెస్
ప్యాకేజీలే!!



-కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261.

